## గన్నవరంలో భారీగా గంజాయి పట్టివేత

విజయవాడ,రాష్ట్రంలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా..మార్పు కనిపించడం లేదు.. గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న పోలీసుకలు మాఫియా సవాల్ విసురుతోంది. . పోలీసులు ఎక్కడిక్కడ తనిఖీలు నిర్వహించి గంజాయిని తరలించే ముఠాను అడ్డుకుని అరెస్టులు చేస్తున్నారు. తాజాగా గన్నవరంలో గంజాయి అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకుని భారీగా గంజాయిని సీజ్ చేశారు. కృష్ణా జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. గన్నవరంలోని బీబీ గూడెం అండర్ పాస్ వద్ద పోలీసులు బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించి వెంటనే అడ్డుకున్నారు. దాదాపు 112 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న మహారాష్ట్ర పూణెలికు చెందిన దీపక్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఃుల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు పూర్వాపరాలను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వివరించారు. సాధారణ వాహన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్నామని ఎస్పీ తెలిపారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :254 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 19-12-2025 | పేజీలు:4 వెల: 2.00


## బీజేపీ కార్యాలయాల ముట్టడికి దిగిన కాంగ్రెస్..తీవ్ర ఉద్రిక్తతలు



హైదరాబాద్, నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై తప్పుడు కేసులు బనాయించడాన్ని..మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పును నిరసిస్తూ ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనలలో హోరెత్తించారు. ఢిల్లీలో పార్లమెంట్ ఎదుట విపక్షాల ఆందోళన చేపట్టాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, ఎంపీలు సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి నేతలు ఆందోళనలో పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ కార్యాలయాల ముట్టడి

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ అక్రమ కేసులను, ఉపాధి హామీ పథకం పేరుమార్పును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బీజేపీ కార్యాలయాల ముట్టడికి దిగాయి. భారీ ర్యాలీలలో హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ కార్యాలయాల ముట్టడికి దిగడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వరంగల్, హైదరాబాద్, నల్లగొండ, కరీంనగర్ బీజేపీ కార్యాలయాల ముట్టడికి కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించిన క్రమంలో బీజేపీ శ్రేణులు ప్రతిఘటనకు సిద్దమవ్వడం ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను నియంత్రించాయి.కరీంనగర్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద హైటెన్షన్ నెలకొంది. నేషనల్ హెరాల్డ్ ఈడీ కేసులో విక్టరీ టు నేషనల్ హెరాల్డ్, విక్టరీ టు యంగ్ ఇండియా అంటూ పోస్టర్లు పట్టుకుని బండి సంజయ్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారు. పోలీసులు కాంగ్రెస్ నేతలను అడ్డుకుని పరిస్థితిని అదుపు చేశారు.

## పంచాయితీ ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు...

హైదరాబాద్,డిసెంబర్18: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అనేక చిత్ర విచిత్రాలు జరిగాయి. ఒకే కుటుంబంలో కొందరు పరస్పరం పోటీ పడ్డారు. డబ్బులు ఇచ్చిన ఓటేయలేదని కొందరు ఆక్రోశించారు. పసుపు బియ్యం పట్టుకుని ప్రమాణం చేయించారు. దేవుడి ఫోటోమీద ప్రమాణాలు జరిగాయి. ఏతావాత ఓటింగ్ మాత్రం అద్భుతంగా సాగింది. ఒకటి, రెండు, మూడు ఇలా స్వల్ప ఓట్ల తేడాతో పలువురు అభ్యర్థులు గెలుపొందగా, మరికొందరు ఓటమి పాలయ్యారు. కొందరికి సమాన ఓట్లు రాగా టాస్ వేసి విజేతలను ప్రకటించారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామంలో ఒక్క ఓటుతో నక్క మల్లేశ్‌ను సర్పంచ్ పదవి వరించింది. మొదట ఒక్క ఓటు అధిక్యం రాగా, రీ కౌంటింగ్‌లోనూ మల్లేశ్‌ను గెలుపు వరించింది. బైంసా మండలం లింగా గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సుష్మారాణి ఒక్క ఓటుతో గెలుపొందారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం గుర్రాలగండిరాజపల్లి లో కాంగ్రెస్ అభ్యర్థి బూస నర్సయ్య ఒక్క ఓటుతో గెలిచారు. నెక్కొండ మండలం అమీన్‌పేటలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి డెక్క చంద్రయ్య తొలుత ఒక్క ఓటుతో గెలువగా, ప్రత్యర్థులు రీ కౌంటింగ్‌కు డిమాండ్ చేశారు. చివరకు కలెక్టర్ జోక్యంతో ఇక్కడ ఫలితాన్ని ప్రకటించినట్టు సమాచారం. కాంగ్రెస్ బలపరిచిన డెక్క ఎల్లయ్యకు 256 ఓట్లు రాగా, బీఆర్ఎస్ బలపరిచిన డెక్క చంద్రయ్యకు 255 ఓట్లు వచ్చాయి. ఒక్క ఓటు తేడాతో ఎల్లయ్య గెలిచినట్టు అధికారులు ప్రకటించారు. నెక్కొండ మండలం సీతారాంపురంలో బీఆర్ఎస్ మద్దతునిచ్చిన అభ్యర్థి కట్కూరి విజయలక్ష్మి ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. నెక్కొండ మండలం రెడ్యానాయక్‌తండాలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి అంగోత్ ఉమ రెండు ఓట్ల తేడాతో గెలిచింది. నెక్కొండ మండలం మడిపెల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి అంగోత్ అనూష మూడు ఓట్ల తేడాతో గెలిచింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండ లం భూక్యాతండా




సర్పంచ్ స్థానానికి తొలు త ఎనిమిది మంది నామినేషన్ వేశారు. కాంగ్రెస్ బలపరిచిన మదన్‌కు మద్దతు ఇవ్వాలని తండావాసుల నిర్ణయంతో ఆరుగురు విత్ డ్రా చేసుకున్నారు. చివరి రోజు బీఆర్ఎస్ బలపరిచిన రమావత్ శ్రీకాంత్ సైతం విత్ డ్రా చేసుకోవడానికి వెళ్లగా, మూడు నిమిషాలు ఆలస్యం కావడంతో అధికారులు లోపలికి అనుమతించలేదు. మూడో విడతతో మూడు ఓట్ల అధిక్యంతో శ్రీకాంత్ గెలిచాడు. అదృష్టం వరించిన అభ్యర్థులు నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని బెల్గాం తండా సర్పంచ్‌గా జాదవ్ గోకుల్‌దాస్ టాస్ ద్వారా ఎన్నికయ్యాడు. బెల్గాం తండా జీపీలో అనిల్, జాదవ్ గోకుల్‌కు 192 చొప్పున సమాన ఓట్లు వచ్చాయి. దీంతో టాస్ వేయగా అదృష్టం గోకుల్‌ను వరించింది. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని కంఠం గ్రామంలో టాస్ ద్వారా సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అజ్గిరి సాయినాథ్ గెలుపొందారు. ఇబ్రహీంపేట్ జీపీ, బోర్లం క్యాంపు తండాలో ఇద్దరు వార్డు సభ్యులను టాస్ ద్వారా నిర్ణయించారు.

## ఒమన్‌లో మినీ ఇండియాను చూస్తున్నా

ఒమన్: ఇరు దేశాల మధ్య మైత్రి బంధం బలోపేతం అవుతుందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. భారత్ ఆర్థికంగా వేగంగా పురోగమిస్తోందని, గత 12 ఏళ్లలో మౌలిక సదుపాయాలు ఐదు రెట్లు మెరుగయ్యాయని, రైల్వే లైన్లు, ఫ్లైఓవర్లు, ఎక్స్‌ప్రెస్ వేలను శరవేగంగా నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఒమన్ ఉప ప్రధానితో ప్రధాని మోడీ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక భాగస్వామ్యం, ప్రపంచం ముందు సవాళ్లపై ఇరు దేశాల మధ్య చర్చలు జరిగాయి. ఒమన్‌లో రెండో రోజు భారతీయులతో ప్రధాని మోడీ పరీక్షా పే చర్చ జరిపారు. స్కూల్ విద్యార్థులతో ప్రధాని ముచ్చటించారు. వికసిత్ భారత్‌లో కొత్త ఎడ్యుకేషన్ పాలసీది కీలక భూమిక పోషిస్తుందని, ఒమన్‌లో తాను ఒక మినీ ఇండియాను చూస్తున్నానని ప్రశంసించారు. గ్రీన్ గ్రోత్ దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని కొనియాడారు. తాము భారత్‌లో చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు నేడు దేశాన్ని ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వ మార్కెట్‌గా నిలిచిందని మెచ్చుకున్నారు. దేశంలో ఆర్థిక క్రమశిక్షణతో పాటు పారదర్శకతను పెంచామని, దీంతో అంతర్జాతీయ పెట్టుబడుదారుల్లో భారత పట్ల నమ్మకం ఏర్పడిందన్నారు. పారిశ్రామిక రంగానికి కొత్త ఊపిరి పోశామని, మాండవి నుంచి మస్కట్



వరకు వ్యాపించి ఉన్న అరేబియా మహా సముద్రంలో రెండు దేశాల సంస్కృతులను, ఆర్థిక వ్యవస్థలను కలిపే ఒక బలమైన వారిధి ఏర్పాటు చేశామన్నారు. జిఎస్‌టి అమలు చేయడంతో భారత దేశం ఒకే సమీకృత మార్కెట్ మారిందని ప్రధాని వివరించారు.

## జీ-రామ్-జీ బిల్లుకు ఆమోదం.. వ్యతిరేకించిన కాంగ్రెస్ సహా విపక్షాలు



న్యూఢిల్లీ, ఎట్టకేలకు రెండు దశాబ్దాల తర్వాత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం- ఎంజీనరేగా రద్దయ్యింది. దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చింది మోదీ సర్కార్.'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆ జీవికా మిషన్-గ్రామీణ్'- బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా అధికార-విపక్షాల మధ్య మాటలు తారాస్థాయికి చేరాయి.

జీ-రామ్-జీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

ఈ క్రమంలో విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశాయి. అయినా పాలకపక్షం అవేమీ పట్టించుకోలేదు. ఒకానొక దశలో విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. ప్రతిపక్ష నేతలు ఆ బిల్లు ప్రతులను చించి విసిరేశారు. సభ్యుల ఆందోళన నడుమ ఓటింగ్ నిర్వహించారు స్పీకర్. దీంతో VB G RAM G Bill కు ఆమోదం లభించింది. గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ రేపటికి వాయిదా పడింది.20 ఏళ్ల ఎంజీనరేగా స్థానంలో VB-G RAM G బిల్లు వచ్చింది. లోక్ సభ ఆమోదం తెలిపింది. ఇక రాజ్యసభ కూడా ఆమోదం వేస్తే అప్పుడు బిల్లుగా మారనుంది. కొత్త బిల్లులో ప్రతీ ఏడాది పని దినాలు 125 రోజుల పాటు అమలు కానున్నాయి. ఈ బిల్లుపై ఎనిమిది గంటల పాటు చర్చ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు.. మహాత్మాగాంధీ ఆదర్శాలను నిలబెట్టుతుందని నొక్కి వక్కానించారు.

వ్యతిరేకించిన కాంగ్రెస్ సహా విపక్షాలు

బాపు ఆదర్శాలను కాంగ్రెస్ తుంగలో తొక్కిందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, ఆయుష్మాన్ భారత్ కింద నిర్మించిన పక్కా ఇళ్లు పేదల జీవితాల్లో మార్పు తెచ్చినవేనని చెప్పారు. ఈ బిల్లు గ్రామాల సర్వతోముఖాభివృద్ధిని నిర్ధారిస్తుందన్నారు. పేదరిక రహితంగా మారుస్తుందని, గ్రామీణుల ప్రయాణానికి ఇంధనంగా నిలుస్తుందన్నారు. 2009 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మహాత్మా గాంధీ పేరును NREGAలో చేర్చారని తెలిపారు.తగ్గుతున్న పేదరికం, డిజిటల్ యాక్సెస్, నిధుల దుర్వినియోగం, బలహీనమైన పర్యవేక్షణ విధానాలు, ఈ పథకం పని తీరు వంటి సవాళ్లను ఎత్తి చూపారు. అధికారిక సమాచారం మేరకు.. 2024-25 ఏడాదిలో రూ. 193.67 కోట్లు దుర్వినియోగం అయ్యాయి. గ్రామీణ కుటుంబాల్లో కేవలం 7.61 శాతం మాత్రమే MGNREGA కింద 100 రోజుల పనిని పూర్తి చేశారు. కొత్త చట్టం మరింత దృష్టి కేంద్రీకరించి జవాబుదారీతనం, సాంకేతికత ఆధారిత వ్యవస్థతో భర్తీ చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ బిల్లుపై కాంగ్రెస్ ఎంపీ జై ప్రకాష్ మాట్లాడుతూ.. జాతిపిత పేరును చట్టం నుండి తొలగించడం అతిపెద్ద నేరంగా వర్ణించారు. ఈ చట్టం రాష్ట్రాలకు కొత్త ఆర్థికభారం అవుతుందన్నారు. గ్రామసభలు ఈ పథకం కింద పనులపై నిర్ణయం తీసుకునే హక్కును కోల్పోతుందన్నారు. ఈ బిల్లు ముమ్మాటికీ పేదలు-దళితులకు వ్యతిరేకంగా అభివర్ణించారు.తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా దీనిపై నోరు విప్పారు. గాంధీ వారసత్వాన్ని మోదీ సర్కార్ అణగదొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. MGNREGA ను రద్దు చేయడం, పథకం పేరు మార్చడం ద్వారా రామరాజ్య ఆలోచనను అక్షరాలా నాశనం చేస్తోందన్నారు. గ్రామీణ ఉపాధి చట్టం నుండి గాంధీ పేరును తొలగించడం ద్వారా మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్‌లను కేంద్రం అగౌరవ పరిచిందని విమర్శించారు.

## ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా స్పీకర్ తీర్పు..



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల అంశం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు.ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా స్పీకర్ తీర్పు వెలువడిందని వ్యాఖ్యానించారు. పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ పార్టీ మారలేదని చెప్పడం విచారకరమన్నారు. భారత రాజ్యాంగం, చట్టాల పట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు గౌరవం లేదని విమర్శించారు.ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ బహిరంగంగా ఉల్లంఘిస్తున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాహుల్ గాంధీకి నిజంగా రాజ్యాంగంపై గౌరవం ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్పీకర్ చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారం న్యాయపరంగా, రాజకీయంగా మరింత వేడెక్కే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.ఇదిలా ఉండగా, ఎమ్మెల్యేల అనర్హతపై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బుధవారం కీలక తీర్పు వెలువరించారు. తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీలపై దాఖలైన అనర్హత పిటిషన్లను ఆయన కొట్టివేశారు. ఈ ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు నిర్ధారించే తగిన ఆధారాలు సమర్పించలేదని స్పీకర్ తన తీర్పులో పేర్కొన్నారు. సాంకేతికంగా వారు ఇంకా భారత రాష్ట్ర సమితిలోనే కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు. అందువల్ల అనర్హత వేటుకు అవకాశం లేదని ప్రకటించారు.మరోవైపు, ఏఐసీసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ చేపట్టిన బీజేపీ కార్యాలయాల ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలను ఈడీ ద్వారా కేంద్ర ప్రభుత్వం వేధిస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఈ నిరసనలకు పిలుపునిచ్చింది. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంతో పాటు పలు జిల్లాల్లో కాంగ్రెస్-బీజేపీ మధ్య నినాదాల పోరు హాట్‌టాపిక్‌గా మారింది.పార్టీ ఆదేశాలతో ఉదయం నుంచే గాంధీభవన్‌కు విధ జిల్లాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. అక్కడి నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేయాలని యత్నించగా, అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. ముఖ్య నేతలతో పాటు మహిళా నేతలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందుగానే అప్రమత్తమైన పోలీసులు గాంధీభవన్, బీజేపీ కార్యాలయాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి.

## రిటైర్మెంట్ కు ముందు ఈ సిక్సర్లు ఏంటి ? జడ్జిలపై సీజేఐ విసుర్లు..!

న్యూఢిల్లీ,దేశవ్యాప్తంగా ప్రస్తుతం న్యాయమూర్తుల్లో ఓ ట్రెండ్ కనిపిస్తోంది. పలు చోట్ల న్యాయమూర్తులు తమ రిటైర్మెంట్ కు ముందు కీలక తీర్పులు ఇస్తున్నారు, లేదా గతంలో ఇచ్చిన తీర్పుల్ని అసాధారణంగా సవరిస్తున్నారు.అలాగే రిటైర్మెంట్ తర్వాత పదవులు కోరుకుంటున్నారు. ఈ ట్రెండ్ పై సుప్రీంకోర్టు ఇవాళ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓ పిటిషన్ పై విచారణ సందర్భంగా ఛీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కింది స్థాయి జడ్జీల తీరును తీవ్రంగా ఆక్షేపించింది.దేశంలో పలు చోట్ల న్యాయమూర్తులు తమ పదవీ విరమణలకు ముందు తీసుకుంటున్న నిర్ణయాలపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. పదవీ విరమణకు కేవలం 10 రోజుల ముందు తన సస్పెన్షన్‌ను సవాలు చేస్తూ మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. సదరు న్యాయమూర్తి జారీ చేసిన రెండు న్యాయపరమైన ఆదేశాలతో ఈ సస్పెన్షన్ కూ లింక్ ఉందనే ఆరోపణలు ఉన్నాయి.దీనిపై దాఖలైన పిటిషన్ పై విచారణ జరిపిన ఛీఫ్ జస్టిస్ సూర్యకాంత్.. పదవీ విరమణకు ముందు పిటిషనర్ సిక్సులు కొట్టడం ప్రారంభించారు, ఇది దురదృష్టకర ధోరణి అన్నారు. తాను దాని గురించి మరింత వివరణ ఇవ్వదల్చుకోలేదన్నారు. జిల్లా న్యాయమూర్తి వాస్తవానికి నవంబర్ 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. కానీ రెండు న్యాయపరమైన ఆదేశాల కారణంగా నవంబర్ 19న సస్పెండ్ అయ్యారు. ఆయన మొదట నవంబర్ 30న పదవీ విరమణ చేయాల్సి ఉండగా, రాష్ట్రం తన ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచిన తర్వాత ఆయన పదవీ విరమణను ఒక సంవత్సరం పాటు వాయిదా వేయాలని సుప్రీంకోర్టు నవంబర్ 20న మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.దీనిపై ఛీఫ్ జస్టిస్ ఫైర్ అయ్యారు. ఆ రెండు ఉత్తర్వులు జారీ



చేసినప్పుడు జడ్జీకి తన పదవీ విరమణ వయస్సును ఒక సంవత్సరం పెంచారని తెలియదని,రిటైర్మెంట్ కు ముందు చాలా ఉత్తర్వులు జారీ చేసే ధోరణి పెరుగుతోందన్నారు. జిల్లా న్యాయమూర్తి తన సస్పెన్షన్‌ను సవాలు చేస్తూ హైకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని కూడా ధర్మాసనం ప్రశ్నించింది.తప్పుడు ఉత్తర్వులు జారీ చేసినందుకు జడ్జిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోలేమని, అయితే సదరు ఆదేశాలు నిజాయితీగా లేకపోతే మాత్రం చర్యలు ఉంటాయని క్లారిటీ ఇచ్చింది.

### వల్లభనేని వంశీపై మరో కేసు నమోదు

విజయవాడ,వైసీపీ కీలక నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఊహించని షాక్ తగిలింది. మాచవరం పోలీస్ స్టేషన్‌లో వల్లభనేని వంశీపై గురువారం కేసు నమోదైంది. సునీల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో వంశీపై కేసు నమోదు చేశారు. 2024లో జులైలో తనపై వంశీ ఆయన అనుచరులు దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వంశీతో సహా మరో ఎనిమిది మందిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

## అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో వారిని జైలుకు పంపుతాం

అమరావతి : ఏపీలో మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయనున్న కూటమి సర్కార్‌కు అధికారంలోకి వచ్చిన వెంటనే తగిన గుణపాఠం చెబుతామని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హెచ్చరించారు. మెడికల్ కళాశాలల నిర్వహణ బాధ్యత తీసుకునే వారిని రెండు నెలల్లో జైలుకు పంపుతామని స్పష్టం చేశారు.మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నిర్వహించిన కోటి సంతకాల సేకరణ ప్రతులు తాడేపల్లికి చేరుకున్నాయి. బాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మొత్తం కోటి 4 లక్షల 11,136 మంది సంతకాల ప్రతులను గురువారం సాయంత్రం లోక్‌భవన్‌లో గవర్నర్‌కు సమర్పించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పార్టీ కీలక సమావేశంలో జగన్ మాట్లాడారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం దారుణమని పేర్కొన్నారు. ఉచిత వైద్యం అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ పెద్ద కుంబకోణమని, ఈ విషయంలో కోర్టులో అఫిడవిట్ వేస్తామని వెల్లడించారు. ప్రైవేట్ వారికి మెడికల్ కాలేజీలను అప్పగించి ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తామని పేర్కొనడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.విద్యను, ఆర్టీసీని, పోలీసు వ్యవస్థను ప్రైవేటీకరణకు



కూటమి ఆలోచిస్తుందని ఆరోపించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా వైసీపీ హయాంలో సంక్షేమ పథకాలను నిర్ణయించిన క్యాలెండర్ ప్రకారం పేదలకు బటన్ నొక్కి అందజేశామని అన్నారు. రెండు సంవత్స రాలుగా కూటమి ప్రభుత్వం వల్ల ఒక్క మేలు జరుగలేదని పేర్కొన్నారు. ఉన్న పథకాలను రద్దు చేయడంతో పాటు సూపర్ సిక్స్‌తో వ్యవస్థలన్నీ కుప్పకూలాయని ఆరోపించారు.

## సంపాదకీయం

శుక్రవారం 19-12-2025

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు

'కార్మిక లోకానికి శాపం ఈ కమ్యూనిస్టులు' అనే శీర్షికన బిజెపి నాయకులు విష్ణువర్ధన రెడ్డి గారు రాసిన ఒక వ్యాసం డిసెంబరు 12వ తేదీ ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురించబడింది.నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వెనకేసుకు రావడం, ఆ విధానాలపై నిరంతరం, నిస్వార్థంగా పోరాడుతున్న కమ్యూనిస్టులను విమర్శించడమే ఆ వ్యాసం ఉద్దేశం. అందులో భాగంగా సహజంగానే ఇటీవల మోడీ ప్రభుత్వం చేసిన నాలుగు లేబర్ కోడ్లను అసత్యాలతో ఆకాశానికెత్తేశారు.అంతిమంగా చూసినప్పుడు ఈ లేబర్ కోడ్లు పచ్చి కార్మిక వ్యతిరేకమైనవే అనడంలో ఎటువంటి సందేహం లేదు. పైపై అంశాలు పక్కన పెడితే, కార్మికులకు ప్రధానంగా అవసరమైనది గౌరవప్రదమయిన వేతనం, పని ప్రదేశంలో భద్రత. వీటికి యాజమాన్యాలు ఒప్పుకోకపోవడం వల్లే కార్మికులు సంఘాలు పెట్టుకోవడం, సమ్మెలు చేయడం జరుగుతూ ఉంటుంది. అందువల్ల వేతనం, సంఘం, సమ్మె–ఈ మూడూ కార్మికుల అస్తిత్వానికి ప్రధానం. అయితే మోడీ ప్రభుత్వం ఈ లేబర్ కోడ్ల ద్వారా కాలరాస్తోంది.వాస్తవంగా మన దేశంలో ఎటువంటి చట్టం లేకముందే కార్మికులు అనేక సమ్మెలు చేశారు. దరిమిలా నాటి బ్రిటిష్ ప్రభుత్వం ట్రేడ్ యూనియన్ చట్టం–1926 చేసింది. ఈ చట్టం ప్రకారం ఏదైనా పరిశ్రమలో ఏడుగురు కార్మికులు కలిసి యూనియన్ ఏర్పాటు చేసుకోవచ్చు. దీన్ని కాస్తా నేడు మోడీ ప్రభుత్వం మార్పివేసింది. కొత్త కోడ్ ప్రకారం 10 శాతం కార్మికులు కానీ, 100 మంది కలిస్తేనే కానీ యూనియన్ ఏర్పాటు కాదు. ఈ నిబంధనకు అనుగుణంగా యూనియన్ ఏర్పాటు చేసుకున్నా, ఒకవేళ ఏదైనా సమయంలో ఈ సంఖ్య తగ్గితే ఆ యూనియన్ రిజిస్ట్రేషన్ రద్దయిపోయే నిబంధన కొత్తగా చేర్చారు. ఇది ఏ రకంగా కార్మికుల ప్రయోజనమో వ్యాస రచయితకే తెలియాలి. దీనివల్ల యూనియన్ ఏర్పాటు చేసుకోవడమే గగనం అయిపోతుంది. పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం ఏదైనా అత్యవసర సంస్థలో సమ్మె చేయాలంటే గతంలో 14 రోజుల నోటీసు ఇవ్వాలి. నేడు దానిని 60 రోజుల వరకు మార్చివేశారు. అలాగే నోటీసు ఇచ్చిన వెంటనే లేబరు కమిషనర్ కన్సిలియేషన్ వేయాలని, అది పెండింగులో ఉండగా సమ్మె చేయరాదని షరతు విధించారు. ఒక వేళ అప్పుడు సమ్మె చేస్తే దాన్ని చట్ట విరుద్ధ సమ్మెగా పరిగణించి, సమ్మె చేసిన వారిని, ప్రోత్సహించిన వారిని కూడా జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించవచ్చు. అంటే ఆచరణలో ఇక సమ్మె చేయడమే దుర్లభంగా మారుతుంది. ఇది కార్పొరేట్ యాజమాన్యాలకు తప్ప కార్మికులకు ఏ రకంగా ప్రయోజనకరమో అర్థం కాని అంశమే.పోనీ ఈ లేబరు కోడ్లలో కార్మికుల వేతనాలు, పని పరిస్థితులు, జీవన ప్రమాణాలు పెంచే అంశాలేమైనా ఉన్నాయా అని దుర్భిణీ వేసి చూసినా అగుపించవు. సరికదా మరింత దిగజారుడే కనపడుతుంది. ఈ ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే కార్మికుని కనీస వేతనం రోజుకు 465 రూపాయలుగా ఇటీవలే కేంద్ర లేబర్ కమిషనర్ ప్రకటించారు. అంటే నెలకు 26 రోజులుగా భావిస్తే వచ్చే వేతనం కేవలం నెలకు 12,090 రూపాయలు. ఈ వేతనమే జీవన ప్రమాణాలను పెంచేసేదిగా వ్యాస రచయితకు కనపడడం విడ్డూరమే. కేంద్ర సంస్థల్లోనే ఇలా ఉంటే, ఇక ప్రైవేటు సంస్థల గురించి వేరే చెప్పనవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం అంత్యోదయ అన్న యోజన కింద పేదలకు ఇచ్చే రేషన్ కార్డు అర్హత నెలకు 15 వేల రూపాయలు. మోడీ ప్రభుత్వం దారిద్ర్య రేఖ కంటే తక్కువగా కనీస వేతనం నిర్ణయించి, సంపద సృష్టికర్తలయిన కార్మికులను నిస్సిగ్గుగా దారిద్ర్యంలోకి నెడుతోంది. ఇక కర్మాగారాల చట్టం ప్రకారం కర్మాగారాలకు వెళ్ళి తనిఖీలు చేసే అధికారాన్ని తీసేశారు. ఇది ఎంతవరకు శ్రేయస్కరం కాదు. ఇలా వేతనాలు పెంచక, సంఘాలు పెట్టుకోనివ్వక, సమ్మెలు చేయనివ్వకుండా ఈ లేబరు కోడ్లు తయారు చేయడం కార్మికులను యాజమాన్యాల దయా దాక్షిణ్యాలకు వదిలివేయడం, ఎటువంటి హక్కులూ లేని బానిసలుగా మార్చేయడం తప్ప మరొకటి కాదు. ఫ్యాక్టరీ చట్టం ప్రకారం భద్రతా ప్రమాణాలను తనిఖీ చేసే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ పేరు కూడా ఫెసిలిటేటర్‌గా మార్చేసి, అధికారాలన్నీ తీసేసి, కార్మికుల ప్రాణాలకు కూడా రక్షణ లేకుండా చేస్తోంది.గిగ్ వర్కర్లకు ఏదో మేలు జరుగుతుందని భావించడం భ్రమే అవుతుంది. ఎందుకంటే ఈ లేబర్ కోడ్లలో ఎక్కడా ప్రభుత్వం వీరి సంక్షేమం కోసం రూపాయి కూడా కేటాయించినట్లు లేదు. ఇక్కడ కూడా యాజమాన్యాల నుండే వసూలు చేస్తారట. అంటే తిరిగి ఆ సేవలు అందుకునే సామాన్యుల మీదే ఆ భారం పడుతుంది. శాశ్వత ఉపాధి దాదాపు లేనట్లుగా చేసి, కాంట్రాక్టు పద్ధతిని వ్యవస్థీకృతం చేసేలా అనేక అంశాలు ఈ కోడ్లలో పొందుపరిచారు. ఇక సంక్షేమం గురించి వేరే చెప్పనవసరం లేదు. పాతికేళ్ళు, ముప్పయ్యేళ్లకు పైగా ఒక పరిశ్రమలో పని చేసి, రిటైరయిన కార్మికునికి ఇపిఎస్ పేరున ఇస్తున్న పింఛను అత్యధిక మందికి మూడు వేల రూపాయలకు మించి లేదు. ఇది అనేక రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇస్తున్న సామాజిక పింఛను నాలుగు వేల రూపాయల కంటే కూడా తక్కువ. ఈ ఇపిఎస్ పింఛను తొమ్మిది వేల రూపాయలకైనా పెంచాలని ఎంత మొర పెట్టుకున్నా మోడీ ప్రభుత్వంలో చలనం లేదు. ఎన్‌పిఎస్, యుపిఎస్ పేరున కార్మికుల పొదుపు సొమ్మును షేర్ మార్కెట్లో పెట్టి మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోంది. ఈ పథకాలను కార్మికుల ప్రయోజనాలకు అనుగుణంగా మార్చాలని ఎన్ని ఉద్యమాలు చేసినా మోడీ ప్రభుత్వం మాత్రం నుండి స్పందన లేదు. ఇదీ మోడీ ప్రభుత్వం శ్రామికులకు ఇస్తున్న గౌరవం.కమ్యూనిస్టులు పరిశ్రమల నాశనమే విధానంగా పని చేస్తారని ఈయన ఇంకో కితాబు ఇచ్చారు. వాస్తవంగా మోడీ ప్రభుత్వ ఈ పదకొండేళ్ళ కాలంలో దేశంలో ఉత్పాదక రంగం బలహీనపడింది. అధికారిక లెక్కల ప్రకారమే అనేక చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు మూతబడ్డాయి. అన్నింటికి మించి, దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మగా ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మేయడమే మోడీ ప్రభుత్వ ప్రధాన విధానంగా ఉంది. రక్షణ రంగం, బ్యాంకులతో సహా సర్వం ప్రైవేట్ పరం అన్నదే ప్రభుత్వ విధానం. తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంటును కూడా తెగనమ్మేయాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ రంగ పరిరక్షణకు పోరాడుతున్న కార్మికులకు పూర్తి అండగా నిలిచింది కమ్యూనిస్టులు కాగా, ఆ వాస్తవాన్ని కూడా చూడ లేకపోవడం దృష్టి లోపం తప్ప మరొకటి కాదు.కమ్యూనిస్టులు కార్మికులను ఓట్ బ్యాంకుగా చూస్తారని ఆరోపణ చేశారు. వాస్తవమేమిటంటే కార్మికులను కులం, మతం, ప్రాంతాల పేరున విడదీసి, వీరి ఐక్యతను విచ్ఛిన్నం చేసి తన రాజకీయ పబ్బం గడుపుకుంటున్నది వీరి బిజెపి పార్టీయే. దీనికి భిన్నంగా తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, ప్రజల, దేశ ఐక్యతను కాపాడుతున్నది కమ్యూనిస్టులే. అటువంటి కమ్యూనిస్టులపైన నిందలు వేయడం సూర్యునిపై ఉమ్మి వేయడం లాంటిదే. వీరు చివరలో పేర్కొన్నట్లు ప్రజలు సరైన సమయంలో సరైన బుద్ధి వీరికే తప్పక చెబుతారు అనడంలో ఎటువంటి సందేహం లేదు.

# యంగ్ ఇండియా స్కూళ్లు.. సమస్యలే సవాళ్లు



హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి విద్యా విజన్ 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'. ఆయన ఎక్కడ మాట్లాడినా అదే విషయం చెబుతుండడాన్ని బట్టి ఆయన ప్రాధాన్యత మనం అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి గత రెండేళ్ళ విద్యామంత్రిగా సైతం ఆయన పోకడలో ఒకింత కన్ఫ్యూజన్ ఒక మేరకు కనిపిస్తోంది. అసలు రేవంత్ చెబుతున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' నేటి ప్రాపంచిక అవసరాల కనుగుణమైన ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో కూడిన విద్యనందించే లక్ష్యం! మంచిదే. దాని సాధ్యాసాధ్యాలు పరిశీలన చేస్తే రేవంత్ విద్యకు కేటాయిస్తానని చెబుతున్న 15% బడ్జెట్ సరిపోతుందా! అనుమానమే. ఒకవేళ దీర్ఘకాలిక ప్రణాళిక అమలు జరిపినా దాని పర్యావసానాలు ఎటు దారితీస్తాయి? తెలంగాణలో విద్యా సమానత, ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ, ప్రస్తుతం ఉన్న రెసిడెన్షియల్ పాఠశాల వ్యవస్థ ఉనికి, పర్యావసానాలు ఏమిటి? ఈ ప్రశ్నలకు ముందు 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' నిర్మాణ స్వరూపం పరిశీలన చేద్దాం. 25 ఎకరాల సువిశాల స్థలం. కోట్లాది రూపాయల విశాలమైన తరగతి గదుల నిర్మాణం, 124 మంది ఆధునిక శిక్షణ పొందిన బోధన, బోధనేతర సిబ్బంది నియామకం, 2600 మంది విద్యార్థుల సామర్థ్యం, ఒక్కో పాఠశాల నిర్మాణానికి 200కోట్ల రూపాయల వ్యయం వెరసి ఈ పాఠశాల స్వరూప స్వభావం.ఇంత భారీ స్థాయి ప్రణాళికతో రూపొందించిన 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు 2024లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంఖుస్థాపన జరిపారు. ఇప్పటికే ఈ పాఠశాలల నిర్మాణం కోసం రూ. 15,600 కోట్లు ఖర్చు చేసినట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. 200 పాఠశాలలకు రూ. 40 వేల కోట్లు ఖర్చు చేస్తానంటున్న ఈ పాఠశాలలు కనీసం మండలానికి ఒకటి ఏర్పాటు చేసినా 634 మండలాల్లో యంగ్ ఇండియా పాఠశాలలకు 1,26,800 కోట్ల రూపాయలు అవసరం అవుతాయి. అంటే మన రాష్ట్ర ఏడాది బడ్జెట్. మొత్తం పాఠశాలలు పూర్తి అయితే 16 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించినట్లు అవుతుంది. ఆలోచన మంచిదే! కానీ, ఆచరణలో ఎదురయ్యే ఇబ్బందులు చూద్దాం. 2023 -24 విద్యా గణాంకాలు ప్రకారం రాష్ట్రంలో 30,022 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 27 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. లక్షమంది సుశిక్షితులైన బోధనా సిబ్బంది ఉంది. మరో వెయ్యి కెసిఆర్ స్థాపించిన రెసిడెన్షియల్ స్కూల్స్, కేంద్రం స్థాపించిన కెజిబివి, కేంద్రీయ విద్యాలయాలు, ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయి. వీటి భవితవ్యం ప్రశ్నార్థకం కానుంది. ఇప్పటికే అనాలోచితంగా రెసిడెన్షియల్ పాఠశాలలు స్థాపన వలన ఐదు లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నమోదు తగ్గిపోయింది. ఈ 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' విధానం కనీసం మండలానికి ఒకటి నిర్మించినా 16 లక్షల మంది విద్యార్థులు నమోదు ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో తగ్గిపోనున్నది.ముఖ్యమంత్రి నియమించిన విద్యా కమిషన్ సేకరించిన వివరాల ప్రకారం 19 వేల ప్రాథమిక పాఠశాలల్లో 13 వేల పాఠశాలల్లో 50 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్నారు. 5 వేల పైచిలుకు ఉన్నత, 4 వేల పైచిలుకు ప్రాథమికోన్నత పాఠశాలలది అదే పరిస్థితి. అంటే బోధనా సిబ్బంది ఉండి, పిల్లలు లేని మూడొంతులు పాఠశాలల్లో ప్రజాధనం కొన్నేండ్లుగా పాలకులు వేతనాలు రూపంలో వృథా చేస్తున్నారు. తెలంగాణకు కేటాయించిన 23 వేలకోట్ల రూపాయలు విద్యా బడ్జెట్‌లో సుమారు 18 వేల కోట్లు వేతనాలకే ఖర్చు అవుతుంది. అంటే యంగ్ ఇండియా స్కూల్స్ ప్రారంభం అయితే, ప్రభుత్వ పాఠశాలలన్నీ, రెసిడెన్షియల్ పాఠశాలలు అన్ని దాదాపు మూతపడతాయి. ఎందుకంటే ఏ తల్లిదండ్రులైనా వసతులు, నాణ్యమైన విద్య అందే పాఠశాలలనే ఎంపిక చేసుకుంటారు. ఒక్కో పాఠశాలకు 25 ఎకరాల చొప్పున 15 వేల 800 ఎకరాల పంట భూములు సేకరించాల్సి ఉంటుంది. అయితే, ఒక్కో ప్రభుత్వ పాఠశాలకు ఎకరం భూమి వేసుకున్నా 30 వేల ఎకరాల విలువైన పాఠశాలల స్థలాలు నిరుపయోగంగా మిగులుతాయి. గత 3 దశాబ్దాలుగా కోట్లాది రూపాయల నిధులతో నిర్మించిన సర్వశిక్షా అభియాన్ తరగతి గదులు పడావు పడతాయి? వీటన్నింటికీ మించి సర్వశిక్షా అభియాన్ నిర్ణయించిన ఐదు కిలోమీటర్ల లోపు ఉన్నత పాఠశాల, మూడు కిలోమీటర్ల లోపు ప్రాథమికోన్నత పాఠశాల, కిలోమీటర్ లోపు ప్రాథమిక పాఠశాల 'అందుబాటు' అనే సమస్య తలెత్తుతుంది.ఒకవేళ రవాణా సౌకర్యం కల్పించినా తలకు మించిన భారమే. ఇంత చేసి 16 లక్షల మంది విద్యార్థులకు 'యంగ్ ఇండియా స్కూల్స్' లో ప్రవేశం కల్పిస్తే ప్రస్తుత గణాంకాలు ప్రకారం ప్రభుత్వ పాఠశాల ల్లో ఉన్న 24 లక్షల మందిలో 8 లక్షల మంది విద్యార్థులు భవితవ్యం ఏమిటి? వారికి మన విద్యాహక్కు చట్టం -2009 ప్రకారం విద్యా సమానత, పిల్లవాడు తాను నచ్చిన పాఠశాలలో విద్యా నేర్చుకునే హక్కును నిరాకరించినట్లే కదా? అప్పుచేసి పప్పుకూడులా లక్షల కోట్ల రూపాయల అప్పు చేసి ఉన్న భూములు వినియోగం చేసుకోకుండా మరో 15 వేల ఎకరాల పంట భూములు సేకరించి, లక్ష కోట్లకుపైగా నూతన నిర్మాణాలు చేయడంలో పారదర్శకత ఎంత? యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణం, భూసేకరణలో కమీషన్ల దందాను, అక్రమాలను అరికట్టడానికి ప్రభుత్వం ఎలాంటి పాలసీ తీసుకోబోతుంది? ఇట్లాంటి విషయాలన్నీ ఆలోచించాల్సిన సమయం ఇది. కనుక ప్రపంచ విద్యా స్థాయి అందుకోవాలనే రేవంత్ రెడ్డి ఆలోచనలు స్వాగతిస్తూనే, ఇప్పుడు ఉన్న ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ, రెసిడెన్షియల్ పాఠశాల వ్యవస్థ పర్యావసానాలు, సంస్కరణ గురించి లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. ఇప్పటికే ఆకునూరి మురళి, కె. కేశవరావు లతో రెండు కమిషన్లు వేసిన ప్రభుత్వం వాటి సిఫార్సులు ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ సంస్కరణలో పరిగణనలోనికి తీసుకొన్న దాఖలాలు కనిపించడం లేదు? వీటన్నింటికీ మించి గత కొన్ని దశాబ్దాలుగా పాలకులే విద్యా బాధ్యతల నుండి వైదొలిగేందుకు, లేక ప్రజల అవసరాలకు తగ్గ పాఠశాల వ్యవస్థ మార్పులు అందించలేకపోయిన పర్యావసానంగా కుప్పలుతెప్పలుగా పెరిగిన ప్రైవేటు విద్యా వ్యవస్థను ప్రభుత్వం ఎలాంటి అంచనాలతో చూస్తుంది.37 లక్షల విద్యార్థుల నమోదు ఉన్న 12 వేల పైచిలుకు ప్రైవేటు పాఠశాల వ్యవస్థలోనూ ఉన్న పేద, మధ్య తరగతి విద్యార్థుల నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్య గురించి, వాటిలో పని చేస్తున్న వేలాది నిరుద్యోగులు గురించి ప్రభుత్వానికి పట్టకపోతే ఎలా? ఇత్యాది విశాలమైన సమస్యలు చర్చించి చేపట్టే విద్యా పథకం మాత్రమే దీర్ఘకాలిక లక్ష్యంతో సఫలమవుతుంది. కనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్' కలను పై సమస్యలన్నింటితో అనుసంధానించి పథక రచన చేసినప్పుడు మాత్రమే, పథకం సత్ఫలితాలు ఇస్తాయి. ఆలోచనలు ఎన్నైనా రావచ్చును గాని, నిర్దిష్టమైన ఆచరణ, సరైన ప్రణాళికతో మాత్రమే నూతన విద్యా వ్యవస్థకు రూపకల్పన చేయగలుగుతాము. సిఎం రేవంత్ రెడ్డి అన్ని కోణాల్లో ఆలోచించి నూతన సవాళ్ళను ఎదుర్కోగలిగిన విద్యా వ్యవస్థ రూపకల్పనలో విద్యారంగ మేధావులు, ప్రజల సలహాలు స్వీకరించడం, అనుసరించడం ప్రజాస్వామిక ఆలోచన అవుతుంది. ఆ దిశగా ప్రభుత్వం అడుగులను వేయాలని కోరుకుందాం. విద్యా వ్యవస్థ ఆధునీకరణను స్వాగతిద్దాం.

## జర్మనీలో రాహుల్ పర్యటన

బెర్లిన,జర్మనీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటన బిజీబిజీగా సాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా మ్యూనిచ్‌లోని బీఎండబ్ల్యూ ప్లాంట్‌ను రాహుల్ గాంధీ సందర్శించారు. అందులోని తాజా మోడల్ కార్లు, ఎలక్ట్రిక్ బైక్‌లు.. ఎం సీరిస్, బీఎండబ్ల్యూ ఐఎస్3, రూల్స్ రాయిస్ తదితర వాహనాలను ఆయన పరిశీలించారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తయారీ రంగంపై దృష్టి పెట్టాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. దేశంలో చిరు వ్యాపారులను పట్టించుకోవడం లేదంటూ కేంద్ర వైఖరిని తప్పుపట్టారు. ఈ సందర్భంగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక వీడియోను పోస్ట్ చేసి ఆయన.. కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీఎస్ 450 సీసీ మోటర్ సైకిల్‌ను బీఎండబ్ల్యూ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఇది భారతీయ ఇంజినీరింగ్ పనితనానికి గర్వకారణంగా ఉందన్నారు. తయారీ రంగం.. బలమైన ఆర్థికాభివృద్ధికి వెన్నుముక వంటిందని అభివర్ణించారు. కానీ విచారం ఏమింటే.. భారత్‌లో మాత్రం ఈ తయారీ రంగం అనేది తగ్గిపోతుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిని వేగవంతం చేయాలంటే.. మనం మరిన్ని ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు.పార్లమెంట్ శీతకాల సమావేశాలు జరుగుతున్నాయి. డిసెంబర్ 15 నుంచి 20వ వరకు జర్మనీ రాజధాని బెర్లిన్ వేదికగా ఇండియన్

# విద్వేషం.. హింస...

ఆస్ట్రేలియాలోని సిడ్నీ అత్యంత పాశవిక మారణకాండకు వేదికగా మారడం దిగ్భ్రాంతికరం. యూదులే లక్ష్యంగా తండ్రీ కొడుకులు తుపాకీ గుళ్ల వర్షం కురిపించడంతో పదేళ్ల బాలిక సహా 16 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 40 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా 'హనూకా' వేడుక చేసుకునేందుకు సిడ్నీలోని బొండీ బీచ్‌లో కొవ్వొత్తులు వెలిగించడానికి వచ్చిన చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ దుండగుల కాల్పుల్లో రక్తమోడడం అత్యంత బాధాకరం. మతపరమైన ద్వేషం, జాత్యహంకారం, విద్వేష ఉపన్యాసాలు, మీడియా, సోషల్ మీడియాలో విస్తరిస్తున్న ఉన్మాద భావనలు.. ఇవన్నీ ఇలాంటి దుర్మార్గాలకు ఆజ్యం పోస్తున్నాయి.విద్వేషం మరింత విద్వేషాన్ని పెంచుతుందే కానీ..శాంతినీ, సామరస్యాన్నీ కలిగించదని గౌతమ బుద్ధుడు దగ్గర నుంచి అన్ని మతాల ప్రవక్తలు ప్రకటిస్తున్నదే! యూదులపై ద్వేషభావం ఆస్ట్రేలియా సమాజాన్ని కలుషితం చేస్తోందని, అక్కడి ప్రభుత్వ విధానాలు ఆ అగ్నికి ఆజ్యం పోస్తున్నాయంటూ%ౌ% ఈ ఘటన జరిగిన వెంటనే ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ ఊగిపోయారు. చిన్నారులు, మహిళలు అన్న కనికరంగానీ, ఆకలి తీర్చుకునేందుకు క్యూలో నిలబడ్డారన్న ఇంగితం కానీ, ఆసుపత్రిలో కొన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారన్న జ్ఞానం కానీ లేకుండా అమానుషంగా 70 వేల మందికిపైగా అమాయకులను ఊచకోత కోసిన నెతన్యాహు సర్కారు, దానికి అండదండలిచ్చిన అమెరికా లాంటి పశ్చిమ దేశాలే%ౌ% ఇలాంటి మారణ హోమాలకు సంజాయిషీ చెప్పాలి. పాలస్తీనాపై నరమేధం తర్వాత ఆస్ట్రేలియాలో యూదు వ్యతిరేక ఘటనలు 316 శాతం పెరగడం, రెండు వేల కంటే ఎక్కువ కేసులు నమోదవడమే ఇందుకు సాక్ష్యం. ప్రాణాలకు తెగించి ఓ దుండగుడి చేతిలోని తుపాకీ లాక్కుని అనేకమంది ప్రాణాలను కాపాడిన అహ్మద్ అల్ అహ్మద్‌కు ప్రపంచమంతా సెల్యూట్ చేస్తోంది. పహల్గాం ఉగ్రదాడి సందర్భంలో టూరిస్టులను కాపాడి, ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా అందరికీ గుర్తొస్తాడు. ఒకరికి ఒకరు వెలుగుగా ఉండాలని, ఐక్యంగా ఉండాలని ఆస్ట్రేలియా ప్రధాని పిలుపునివ్వడం, అహ్మద్‌ను ఆసుపత్రిలో కలిసి అభినందించడం మంచి పరిణామం. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరగడంతో తుపాకీ నియంత్రణ చట్టాలను ఆస్ట్రేలియా అమలు చేస్తోంది. వాటికి మరింత పదును పెట్టడం, దోషులను కఠినంగా శిక్షించడం, సమాజంలో సోదర భావాన్ని పెంపొందించడం అత్యవసరం.ఒక ఘటన జరగ్గానే



ఆ మతానికి చెందిన ప్రతి ఒక్కరినీ ద్వేషంతో చూడటం మొదలు పెడితే సమాజం విడిపోతుంది. మెజారిటీ, మైనారిటీ మతోన్మాదులు కోరుకునేది ఇదే. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌తోపాటు సంఘ్ పరివార్‌లోని విహెచ్‌పి, బజరంగ్‌దళ్ లాంటి సంస్థలు రెచ్చిపోతున్నాయి. మైనారిటీలంతా శత్రువులు, జీహాదీలని, వారిపై దాడులు చేయడం ధర్మ రక్షణ అని, మసీదులు, చర్చిలపై దాడులు చేయడం హీరోయిజం అని యువతను పక్కదోవ పట్టించడం, అందుకోసం అలవోకగా అబద్ధాలను ప్రచారం చేయడం అత్యంత ప్రమాదకరం. గోడీ మీడియాతోపాటు సోషల్ మీడియా కూడా అందుకు ఇతోధికంగా సహకరించడం తగదు. అమెరికా, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో మైనారిటీగా వున్న హిందువులపై దాడులు జరిగినప్పుడు విహెచ్‌పి లాంటి సంస్థలు మొసలి కన్నీరు కారుస్తున్నాయి. విద్వేషం ఏ దేశంలోనైనా మైనారిటీలకు ముప్పుగా పరిగణిస్తుందనేది జగమెరిగిన సత్యం. జాత్యహంకారం, విద్వేషాన్ని పెంచి పోషిస్తేఅది తిరిగి వారినే కాటేస్తుందనడానికి పక్కనే ఉన్న పాకిస్తాన్ లాంటి దేశాల్లో నిత్యం సాగుతున్న ఉగ్రవాద ఘటనలే ఉదాహరణ.భిన్నత్వంలో ఏకత్వాన్ని, లౌకికవాదాన్ని, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని, రాజ్యాంగ విలువలను రక్షించుకోవడమే భారతీయత. సమాజంలో, రాజకీయాల్లో పెరుగుతున్న ద్వేషాన్ని తిప్పికొట్టడంతోపాటు అహ్మద్‌లా తోటివారి కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే స్ఫూర్తిని మనసు నిండా నింపుకోవడం తక్షణ కర్తవ్యం. విద్వేషాన్ని విడనాడి మానవత్వమే మతమని, అభిమతమని, అత్యున్నతమని ప్రతి ఒక్కరూ ప్రతిన బూనడమే ఇలాంటి మారణహోమాలకు విరుగుడు.

# మోడీతో భేటీ అంశాలు బయటకు ఎలా వచ్చాయి?

న్యూఢిల్లీ, తెలంగాణలో బిజెపి నేతలు క్షేత్రస్థాయిలో సరిగా పనిచేయడం లేదని, పార్టీ బలోపతేంపై దృష్టి సారించడం లేదని ఇటీవల ప్రధాని మోడీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్రమోదీతో ఇటీవల తెలంగాణ బీజేపీ నేతలు సమావేశం అయిన విషయం తెలిసిందే. ఈ సమావేశం లో నేతలకు పలు కీలక అంశాలపై ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారు. అయితే ఈ భేటీలో ప్రస్తావించిన విషయాలు బయటకు వచ్చాయి. ఈ విషయంపై ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో తెలంగాణ బీజేపీ ఎంపీల సమావేశంపై వచ్చిన లీకులపై కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీతో చర్చించిన విషయాలు బయటకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఎవరో కావాలనే ఈ విషయాలను లీకు చేశారని ÷ర్ అయ్యారు. ఈ సమావేశంలో ప్రస్తావించిన అంశాలను బయటకు చెప్పొద్దని మోదీ చెప్పారని గుర్తుచేశారు కిషన్‌రెడ్డి. కానీ మీటింగ్‌లో జరిగిన విషయాలను బయటకు ఎవరు ఎందుకు చెప్పారని మండిపడ్డారు. వారెవరో చెబితే వారిపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాని మోదీ మీటింగ్‌లో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని మాత్రమే చెప్పారని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీని మరింతగా బలోపేతం చేయాలని మోదీ కోరారని అన్నారు. దక్షిణాది నుంచి ఇప్పటివరకు ఇద్దరు ఉపరాష్ట్రపతులు అయ్యారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు సరికాదని అన్నారు. ఆయన అనైతికంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ స్థాయిని తగ్గించేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ విపక్ష నేతగా ఉండటం దురదృష్టకరమని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## పోలీసులకు చిక్కిన 17మంది మావోలు

ఆదిలాబాద్, మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేక మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా.. భారీ సంఖ్యలో మావోలు లొంగిపోయారు. ఇప్పుడు తాజాగా మావోయిస్టు కీలక నేత పోలీసులకు చిక్కినట్లు తెలుస్తోంది. మావోయిస్టు అధినేత చొక్కరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మంగళవారం ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ)లో 15 మంది మావోయిస్టులు పోలీసులకు చిక్కారు. పట్టుబడ్డ వారిలో 9 మంది మహిళలు ఉండగా 7 పురుషులు ఉన్నట్టు సమాచారం. అలాగే వారిలో మావో అగ్రనేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వారందనీ హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి తరలిస్తున్నారు. మావోయిస్టులు పట్టుబడటంపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## కెసిఆర్ వచ్చినా..కెటిఆర్ పాదయాత్ర చేసినా ఏం లాభం

హైదరాబాద్, కెసిఆర్ బయటకు వచ్చినా..కెటిఆర్ పాదయత్ర చేసినా ఉపయోగమేమిటని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బయటకు వచ్చినా చేసేదేమీ లేదన్నారు. కేటీఆర్ పాదయత్ర చేసి ఏం సాధిస్తారని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్లలో చేయనిది సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్లలో చేశారని.. పాదయాత్ర చేస్తే కేటీఆర్‌కు ఈ విషయం అర్థమవుతుందన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్‌పై ఆది శ్రీనివాస్ నిప్పులు పార్టీ అధినేత కేసీఆర్ బీ ఫారం ఇచ్చినా కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఎందుకు ఓడిపోయారంటూ సందేహం వ్యక్తం చేశారు. కేటీఆర్ తొలిసారి 171 ఓట్ల మెజార్టీతో గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారని.. కానీ తాను మొదటి సారి 14,561 ఓట్లతో విజయం సాధించానని ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. తండ్రి చాటు బిడ్డగా కేటీఆర్ రాజకీయాల్లోకి వచ్చారని ఆయన వ్యంగ్యంగా పేర్కొన్నారు. తాను కష్టపడి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అయితే కేసీఆర్ మనవడు అధికారిక కార్యక్రమాలకు హాజరయ్యారని.. కానీ రేవంత్ మనవడు ప్రయివేట్ కార్యక్రమానికి వచ్చారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వివరించారు. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు.. మూడు దశల్లో జరుగుతున్నాయి. రేపటితో అంటే డిసెంబర్ 17వ తేదీ మూడో దశతో ఈ ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. అయితే రెండు దశల్లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కొన్ని స్థానాలను గెలుచుకుంది. ఈ ఫలితాలు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నాయని కేటీఆర్ ఇప్పటికే ప్రకటించారు. రోవైపు డిసెంబర్ 19వ తేదీన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో ఆ పార్టీ అధినేత కేసీఆర్ సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయలని హామీలు, తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు, ఏపీ ప్రభుత్వం చేపట్టనున్న పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్ట్ అంశం, తెలంగాణలో ప్రాజెక్ట్ అంశాలను కేసీఆర్ ప్రస్తావించే అవకాశం ఉన్నట్లు సమాచారం.మరోవైపు తెలంగాణలో పాదయాత్ర చేపట్టనున్నట్లు కేటీఆర్ ఇప్పటికే ప్రకటించారు. కేటీఆర్ చేపట్టే ఈ యాత్ర వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరదంటూ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శిస్తున్న విషయం విదితమే.

## ఎలాన్ మస్క్ సరికొత్త రికార్డు

న్యూయార్క్,అమెరికన్ టైకూన్, ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సరికొత్త రికార్డును నెలకొల్పారు. వ్యక్తిగత సందప పరంగా మస్క్ ఏకంగా 600 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరారు . తద్వారా ప్రపంచంలోనే తొలిసారి ఈ రికార్డు నెలకొల్పిన వ్యక్తిగా మస్క్ చరిత్ర సృష్టించారు. మస్క్ స్థాపించిన అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్ విలువ 800 బిలియన్ డాలర్లకు చేరుకుని, ఐపీఓగా వచ్చే అవకాశం ఉందనే వార్తల నేపథ్యంలో ఆయన సంపద ఈ స్థాయికి పెరగడం విశేషం. వచ్చే ఏడాది స్పేస్‌ఎక్స్ పబ్లిక్‌లోకి వెళ్లడానికి సిద్ధమవుతోందని రాయిటర్స్ వార్తాసంస్థ గత వారం నివేదించిన విషయం తెలిసిందే. స్పేస్‌ఎక్స్‌లో మస్క్‌కు దాదాపు 42శాతం వాటా ఉంది. ఈ సంస్థ వాల్యూ పెరగడంతో మస్క్ సంపద కూడా వృద్ధి చెందింది. ఒక్క రోజులోనే 168 బిలియన్ డాలర్లు పెరిగి సోమవారం మధ్యాహ్నం సమయానికి మస్క్ నికర సంపద దాదాపు 677 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది. ఇక ఈ ఏడాది అక్టోబరులో మస్క్ నికర సంపద 500 బిలియన్ డాలర్లు దాటిన సంగతి తెలిసిందే. 2022లో మస్క్ సంపద 200 బిలియన్ డాలర్ల కంటే దిగువకు పడిపోయింది. ఆ తర్వాత మస్క్ సంపద పెరుగుతూ వస్తోంది. ఈ మూడేళ్లలోనే మస్క్ సంపద 600 బిలియన్ డాలర్లు దాటడం విశేషం. ఇప్పటివరకు ప్రపంచంలో ఏ కుబేరుడు ఈ స్థాయిలో సంపదను ఆర్జించలేదు. మరోవైపు కార్పొరేట్ చరిత్రలోనే అత్యధిక జీతం అందుకుంటున్న సీఈవోగా మస్క్ రికార్డు క్రియేట్ చేశారు. జీతం కింద మస్క్‌కు ట్రిలియన్ డాలర్లు ఇచ్చేందుకు టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో గత నెల జరిగిన టెస్లా వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో పే ప్యాకేజీలో కొత్త రికార్డు క్రియేట్ అయ్యింది.

## 8 నెలలుగా కాలువ మరమ్మత్తులపై నిర్లక్ష్యం

నిజామాబాద్, నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉరి వేసుకున్న నిజామాబాద్ అభివృద్ధి పేరిట ఏర్పాటు చేసిన ప్లెక్సీ కలకలం రేపింది. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ పక్కన ఉన్న లలిత కాంప్లెక్స్ షాప్ రెండర్స్ ఏర్పాటు చేసిన ప్లెక్సీ జిల్లాలో చర్చకు దారి తీసింది. మురికి కాలువ మరమ్మతుల కోసం మున్సిపాల్ సిబ్బంది గత 8 నెలల క్రితం జేసీబీ ద్వారా పనులు చేపట్టి ఇప్పటివరకు దాన్ని పూడ్చలేదని, ఈ సందర్భంగా మురికి కాలువను సరి చేయమని లలిత కాంప్లెక్స్ షాప్ రెంటల్స్ అందరూ కలిసి మున్సిపాలిటీ సిబ్బందికి ,ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశారు. అయినప్పటికి ఎటువంటి స్పందన రాలేదని మురికి కాలువ నుండి వచ్చే దుర్వాసన, విపరీతంగా పెరుగుతున్న దోమల ద్వారా కాంప్లెక్స్ వాళ్లందరూ అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయని తమ సమస్యను పరిష్కరించే నాథుడే కరువాయాలని కాంప్లెక్స్ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాండ్ పక్కనే ఉన్ మురికి కాలువను చూసుకుంటూ ఎన్నోసార్లు ప్రయాణం చేసిన నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే, ఎంపీలకు సమస్య దృష్టికి రావడం లేదని, సమస్య తీరడం లేదు అని ప్లెక్సీలో పేర్కొన్నారు. కాగా, ప్లెక్సీలు చూసిన వారంతా సమస్య ఈ ఒక్క ప్రాంతంలో మాత్రమే కాదని నగరం మొత్తం మురికి రోడ్ల పైన గుంతలు, ఎత్తు పెరిగిన మాన్ హోల్స్ తో పట్టణంలో ప్రతి చోట సమస్యలు ఎదురవుతున్నాయని, పట్టించుకునే వారే లేరని చర్చించుకోవడం గమనార్హం.

## పెద్ద ప్లానింగే!

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాలు అత్యంత వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన తాజా ప్రకటనలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపునకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు అయిన కవిత.. 2029 సార్వత్రిక ఎన్నికలలో సామాజిక తెలంగాణను లక్ష్యంగా చేసుకొని తాము పోటీ చేస్తామని ప్రకటించడం ద్వారా కొత్త రాజకీయ పార్టీ పెట్టబోతున్నారన్న ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. కవిత ఎక్స్ వేదికగా నిర్వహించిన ఆస్క్ కవిత సెషన్ లో నెటిజన్ల ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు.

2029 ఎన్నికల్లో పోటీ.. ప్రజల నుండే పార్టీ పేరు

కొత్త పార్టీ ఏర్పాటుపై అడిగిన ప్రశ్నకు కవిత ఆసక్తికరంగా స్పందించారు. 2029 ఎన్నికలలో పోటీ చేయడం ఖాయమని తేల్చిచెప్పారు. అంతేకాకుండా పార్టీ పేరును కూడా ప్రజలు సూచించిన దానినే పెడుతామని స్పష్టం చేశారు.

యువతకు ఉద్యోగ కల్పనే తొలి ప్రాధాన్యం

రాజకీయాల్లో తమ తొలి ప్రాధాన్యం యువతకు ఉద్యోగాల కల్పనే అంటూ కవిత తేల్చిచెప్పారు. మహిళలకు , యువతకు రాజకీయ అవకాశాలు కల్పించడానికి జాగృతి కృషి చేస్తుందని వారికి నచ్చిన రంగాలలో రాణించేలా ప్రోత్సహించడం అవసరమని పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి పాలనకు వ్యతిరేకంగా కవిత పోరు

రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డికి అనుకూలంగా ఉన్నట్టుగా కవితపై ఆరోపనలు వచ్చాయి.దాన్ని చెరిపేసే పనిలో తాజాగా రేవంత్ రెడ్డి పాలనను కవిత గట్టిగా టార్గెట్ చేశారు. హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించకపోవడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు చదువుకు దూరం కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలు చాలా బాధాకరమన్నారు. ఫార్మాసిటీ కోసం తీసుకున్న భూముల్లో ఫ్యూచర్ సిటీ డ్రామాను ఖండించారు. త్వరలోనే అక్కడి రైతులకు మద్దతుగా పోరాటం చేస్తానని ప్రకటించారు. ఇక తెలంగాణ జాగృతిని బలోపేతం చేసి త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని కవిత ఈ సందర్భంగా తెలిపారు.

సింగరేణి, హైదరాబాద్ అభివృద్ధిపై ఫోకస్

సింగరేణి సంస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని పేర్కొన్న కవిత, హెచ్ఎంఎస్ తో కలిసి ప్రభుత్వ విధానాలపై ఉద్యమిస్తానని స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ వెస్ట్ అభివృద్ధిపై చూపిన శ్రద్ధ ఈస్ట్ సిటీపైన లేదని.. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ఇక కవితన వ్యక్తిగత అభిరుచులను పంచుకున్నారు. తాను మెగాస్టార్ చిరంజీవి అభిమానిని అని స్పష్టం చేశారు. నటుడు రాంచరణ్ కూడా చాలా వినయంగా ఉండే మంచి డ్యాన్సర్ అని చెబుతూనే.. ఏదేమైనా చిరంజీవి తర్వాతే అంటూ కవిత వ్యాఖ్యానించారు.కవిత ప్రకటనలు చూస్తే 2029 ఎన్నికల నాటికి తెలంగాణలో రాజకీయ సమతుల్యత మారే అవకాశం ఉందని సామాజిక న్యాయం, యువతకు ఉపాధి కల్పన అంశాలు ప్రధాన అజెండా మారనున్నాయని తెలుస్తోంది.

## రాజధాని కాలుష్యంపై ఆందోళన

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుని అల్లాడిపోతోంది. శీతాకాలం కావడంతో ఢిల్లీలో వాయు కాలుష్య సంక్షోభం తలెత్తింది. గత కొన్ని రోజులుగా వాయు కాలుష్యం ప్రమాదకరస్థాయిలో నమోదవుతోంది. ఏక్యూఐ లెవెల్స్ 400కిపైనే నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు పలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలుష్య కట్టడికి ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ఇప్పటికే పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని అన్ని సంస్థలకు 50శాతం వర్క్ ఫ్రమ్ హోమ్‌ను తప్పనిసరి చేసింది.

ఢిల్లీ ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు తప్పనిసరిగా 50 శాతం వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిలో పనిచేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తామని కూడా హెచ్చరించింది. అంతేకాదు, కాలుష్య నిరోధక ఆంక్షల కారణంగా పని కోల్పోయిన రిజిస్టర్డ్ నిర్మాణ కార్మికులకు రూ. 10,000 పరిహారం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాజధాని ఢిల్లీలో కాలుష్యం కట్టడిపై అక్కడి ట్రిపుల్ ఇంజిన్ సర్కారు చేతులెత్తేసింది. రోజురోజుకూ దిగజారుతున్న కాలుష్య ప్రమాణాలపై బీజేపీ మంత్రి మంజీందర్ సింగ్ మంగళవారం ప్రజలకు క్షమాపణ చెప్పారు. కాలుష్య కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని అంగీకరించిన ఆయన, ఆ తప్పునకు మాత్రం మునుపటి ఆప్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కేవలం 9,10 నెలల్లో కాలుష్య స్థాయిని తగ్గించడం సాధ్యం కాదన్నారు. ఢిల్లీలో కాలుష్యం నేపథ్యంలో ఇక నుంచి పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ ని చూపిన వాహనదారులకే ఇంధనం నింపాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### ఏఎన్ఆర్ కాలేజీకి నాగార్జున 2కోట్ల విరాళం

విజయవాడ,ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జున బుధవారం కృష్ణా జిల్లా గుడివాడలో ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం అక్కినేని కుటుంబం తరుపున రూ.2 కోట్లను అందజేశారు.

# ఆందోళనకరంగా రూపాయి పతనం !

న్యూఢిల్లీ,రోజురోజుకూ రూపాయి పతనం ఆందోళన కలిగిస్తోంది. అదేపనిగా దిగుమతులు పెంచుకోవడం, ఎగుమతులు తగ్గడం వంటి కారాణాలకు తోడు అంతర్జీతాయ పరిణామాల నేపథ్యంలో రూపాయి దిగజారుతోంది. ప్రపంచ మార్కెట్లో మన వస్తువుల ఉత్పత్తులు పెరిగితేనే మన విదేశీ మారక నిల్వలు పెరగడంతో పాటు, రూపాయి బలపడగలదు. అయితే గత దశాబ్దకాలంతో పోలిస్తే రూపాయి విలువ వందశాతం పడిపోయింది. ఇప్పుడు డాలర్‌తో పోలిస్తే 91 రూపాయలకు చేరింది. ఇది మనకు గుదిబండగా మారినా పెద్దగా స్పందన రావడం లేదు. ఆర్థికవేత్తలు, ప్రభుత్వం దీనిపై సీరియస్‌గా దృష్టి సారించడం లేదా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి యధేచ్ఛగా దిగజారుతూనే ఉంది. మంగళవారం డాలర్ మారకంలో రూపాయి విలువ మరో 15 పైసలు క్షీణించి ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి 90.93 వద్ద స్థిరపడింది. అంతకు ముందు ఇంట్రాడేలో 36 పైసలు క్షీణించి జీవితకాల కనిష్ఠ స్థాయి 91.14 వరకు కూడా దిగజారింది. కేవలం 10 ట్రేడింగ్ సెషన్లలోనే డాలర్ మారకం లో రూపాయి 90 నుంచి 91 స్థాయికి పడిపోయింది. కేవలం ఐదు సెషన్లలోనే 1 శాతం మేరకు నష్టపోయింది. డాలర్ బలహీనత, క్రూడాయిల్ ధరల తగ్గుదల సైతం రూపాయి పతనాన్ని నిలువరించలేకపోయాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.54 శాతం దిగజారి 59.63 డాలర్లకు దిగివచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నెలలోనే రూపాయి 92 కన్నా దిగజారవచ్చని ఫారెక్స్ ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి భారత్ చేసిన కొత్త ప్రతిపాదనలను స్వీకరించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించలేదన్న వార్తలు రూపాయి మారకాన్ని ప్రభావితం చేశాయని ఫారెక్స్ ట్రేడర్లంటున్నారు. సరికొత్త ప్రతిపాదనలను భారత్ ఖరారు చేసే వరకు డీల్ నిలిచిపోయినట్టే అన్న భయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశా యి. మరోపక్క రూపాయి పతనాన్ని నిలువరించేందుకు ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోవడం వల్ల విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నిధులు ఉపసంహరించడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టయింది.ఇదిలా ఉండగా 2027 జూన్ నాటికి రూపాయి 92-94 స్థాయికి దిగజారవచ్చని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్ నీలకంఠ్ మిశ్రా అంచనా వేస్తున్నారు. అయితే రూపాయి ఎంత దిగజారినా మనం భయపడాల్సిందేమీ లేదన్నది ఆయన అభిప్రాయంగా ఉంది. మనం 68,500-69,000 కోట్ల డాలర్ల భారీ విదేశీ మారకపు నిల్వలతో అత్యంత శక్తివంతంగా ఉన్నామని ఆయన అన్నారు. ఈ ఏడాది డిసెంబరు 3వ తేదీ వరకు రూపాయి విలువ 5.1 క్షీణించిందని కేంద్రమంత్రి పంకజ్ వెల్లడించారు. రూపాయి విలువ ఇంతగా పడిపోవడానికి వాణిజ్య లోటే కారణమని ప్రభుత్వం చెబుతోంది. రూపాయి నిరంతర పతనం అంశాన్ని కొందరు సభ్యులు రాజ్యసభలో ప్రస్తావించగా ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదురి ఈ ప్రకటన చేశారు. ఈ ఏడాది రూపాయి విలువను వాణిజ్య లోటు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ప్రభావితం చేశాయని మంత్రి చెప్పారు. రూపాయి విలువ క్షీణత వల్ల ఎగుమతి రంగం పోటీ సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు. ఇదే సమయంలో దిగుమతుల విలువ పెరగవచ్చని కూడా ఆయన అంగీకరించారు. రూపాయి విలువను మార్కెట్ నిర్ణయిస్తుందని, దానికి ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించలేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే రూపాయి కదలికలను ఆర్‌బీఐ నిరంతరం ట్రాక్ చేస్తున్నదని, ఆటుపోట్లు తీవ్రంగా ఉంటే అవసరమైన మేరకు జోక్యం చేసుకుంటుందని ఆయన చెప్పారు. అయితే డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ మరింత క్షీణించే అవకాశం ఉందని, అయితే దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొందరు వాదిస్తున్నారు. ఫార్వర్డ్స్ మార్కెట్‌లో ఆర్‌బీఐ జోక్యం వల్ల సమస్య వస్తోందని, ఇంతకు ముందు రూపాయిని ఒక స్థాయికి కట్టడి చేయడం ఒక తప్పిదమని పేర్కొన్నారు. గతంలో చేసిన తప్పిదాలు ఇప్పటికీ వెంటాడుతున్నాయని తెలిపారు. ఇకపోతే ఇటీవలి కాలంలో అమెరికా తనకు గిట్టని దేశాలపై డాలర్‌తో బాదుతోంది. రష్యా, ఇరాన్, వెనెజువెలా దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించింది. డాలర్లు చిక్కకుండా చేసి, వాటి వ్యాపారాన్ని



దెబ్బతీసింది. ఆ దేశాలను ప్రపంచ వాణిజ్యం నుంచి బయటికి పంపడానికి ఇదంతా చేసింది. రేపు తమకూ ఇలాంటి పరిస్థితే తలెత్తితే ఎలాగని ఇతర దేశాల్లో ఆందోళనతో కూడిన అనుమానం మొదలైంది. ఫలితంగా, డాలర్ మీద ఆధారపడటం తగ్గించి కొత్త మార్గాల్లో వాణిజ్యం చేసే ప్రయత్నం ఊపందుకొంటోంది. రష్యా కూడా చైనా, భారత్, కొన్ని ఆఫ్రికన్ దేశాల కరెన్సీలు, రూబుళ్లలో వ్యాపారం చేస్తోంది. భారత్ 30 దేశాలతో రూపాయితో జమలు, చెల్లింపులకు ఖాతాలు తెరచింది. అయితే రష్యాకు భారత్ చేసే ఎగుమతులకన్నా దిగుమతులే ఎక్కువ కావడంతో మన రూపాయలు రష్యన్ బ్యాంకుల్లో పేరుకుపోతున్నాయి. రష్యా భారత్ నుంచి ఎక్కువ దిగుమతులు చేసుకుంటే అవి ఖర్చయ్యేవి. కాకపోతే, ఆ రూపాయలతో భారత్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉండటంతో, ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత్ ఇతర దేశాలతో రూపాయలు, స్థానిక కరెన్సీల్లో వ్యాపారం మొదలుపెట్టింది. సింగపూర్, యుఏఈ, నేపాల్, భూటాన్‌లలో యూపీఐ చెల్లింపులు ఊపందుకుంటున్నాయి. ఒక్కసారిగా డాలర్లకు దూరం జరిగితే చమురు, ఇతర దిగుమతుల ధరలు పెరిగిపోయి సామాన్యులు ద్రవ్యోల్బణం బారిన పడతారు. అందుకే డాలర్ ఆధిపత్యాన్ని క్రమక్రమంగా వదిలించుకోవాలని ప్రపంచ దేశాలు చూస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా బలమైన వాణిజ్యం దిశగా అడుగులు వేయాల్సి ఉంది. అంతకుముందే రూపాయిని బలోపేతం చేసుకుంటే మంచిది. ప్రపంచంలో ఇప్పటికీ 47శాతం లావాదేవీలకు డాలర్లనే ఉపయోగిస్తున్నారు. అందుకని, మరికొంత కాలం డాలర్ ఆధిపత్యం కొనసాగవచ్చు. ఆ తరవాత కూడా డాలర్ స్థానాన్ని ఏ ఒక్క దేశ కరెన్సీ ఆక్రమించకపోవచ్చు. స్థానిక కరెన్సీలు, డిజిటల్ కరెన్సీలు, బంగారం వాడకం పెరగవచ్చు.

## ముథోల్‌లో భారీగా ఓటర్ల తరలిరాక

నిర్మల్,పంచాయతీ ఎన్నికల్లో స్థానిక ప్రజలు ఓటేసేందుకు భారీగా తరలి వచ్చారు. దీంతో గ్రామాల్లో పోలింగ్ 85శాతం వరకు చేరుకుంది. నిర్మల్ జిల్లా ముథోల్ పోలింగ్ కేంద్రంలో ఓటర్లు క్యూలైన్‌లో బారులు తీరి కనిపించారు. పోలింగ్ సమయం ముగిసినా క్యూలో ఉండడంతో వారికి ఓటేసేందుకు అధికారులు అనుమతించారు. మధ్యాహ్నం ఒంటి గంట లోపు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఓటర్లకు సిబ్బంది టోకెన్లు అందజేశారు. దాదాపు 10 వేలకు పైగా ఓటర్లు కలిగిన ఈ పంచాయతీలో సర్పంచ్ పదవి కోసం 10 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. భారీ సంఖ్యలో ఉన్న ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. మొత్తం 16 వార్డులకు గాను ఒక్క వార్డు ఏకగ్రీవమైంది. మిగిలిన 15 వార్డులకు సరిపడేలా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయలేదు. మరోవైపు ఈ 15 వార్డుల్లో 50 మంది అభ్యర్థుల వరకు పోటీలో ఉన్నారు. దీంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లంతా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఓటు వేసే వారందరికీ ప్రవేశం, నిష్క్రమణ ఒకే మార్గం కావడంతో రద్దీ పెరిగింది.

# ఎన్నికల సంస్కరణలపై ఆసక్తిలేని కాంగ్రెస్ ?

హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోవడంతో నానా తంటాలు పడుతోంది. పదేళ్లపాటు యూపిఎ ద్వారా ఓ వెలుగు వెలిగి నానా అరాచకాలకు పాల్పడింది. ఆనాడు పదేళ్లు ఎలా అధికారంలోకి వచ్చిందన్నది చెప్పడం లేదు. కేవలం ఓటు చోరీపైనే అధికారంలోకి వచ్చారా అన్నది ప్రజలకు చెప్పాలి. స్వాతంత్ర్యానం తరం అనేక ఏళ్లపాటు అధికారంలో ఉంది. అప్పుడు మరి ఓటు చోరీ చేశారా అన్నది చెప్పాలి. పార్లమెంటు లో ఓటు చోరీ సందర్భంగా కొన్ని మౌళిక ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. వాటికి కాంగ్రెస్ పార్టీ, విపక్ష నేత రాహుల్ సమాధానం చెప్పలేక పోయారు. హోంమంత్రి అమిత్ షా అనేక విషయాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్యానంతరం ఎవరు ప్రధానిగా ఉండాలని ఓటింగ్ జరిగితే అంతా సర్దార్ పటేల్ పేరు చెప్పారు. కానీ నెహ్రూ మత్రమే ప్రధాని అయ్యారు. ఇందిర హయాంలె అలహాబాద్ హైకోర్టు, ఆమె ఎన్నిక చెల్లదని తీర్పు చెప్పింది. అలాగే ప్రధాన న్యాయమూర్తుల సీనియారిటీని కాదని ఐదో స్థానంలో ఉన్న వ్యవక్తిని చీఫ్ జడ్జిగా నియమించారు.ఇలా అనేక అంశాలను అమిత్ షా ప్రస్తావించారు. ఇవన్నీ ఎందుకు చర్చించాలంటే ... కాంగ్రెస్ అధికారం కోల్పోతే ఓట్ చోరీ జరగిందని ఇటీవల రాహుల్ రంకెలు వేస్తున్నారు. ఢిల్లీలో ర్యాలీలు తీసి నానా హంగామా చేశారు. నిజానికి సర్‌పై చర్చలో ప్రధాన అంశాలేవీ చర్చకు రాలేదు. ఎన్నికల సంస్కరణలపై చర్చలో కాంగ్రెస్‌కు పెద్దగా ఆసక్తి లేదు. కేవలం ఓట్ల తొలగింపుపైనే కాంగ్రెస్ మండిపడుతోంది. అయితే పాక్, బంగ్లాదేశ్‌ల నుంచి అక్రమంగా వసలవచ్చిన వారి ఓట్లను తొలగించడం ద్వారా ఎన్నికల సంఘం తన విధిని తాను చేసుకుంటూ పోతోంది. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘాన్ని తప్పుపట్టడం ద్వారా రాహుల్ రాజ్యాంగ ద్రోహానికి పాల్పడ్డారనే భావించాలి. అలాగే భారత రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో పేర్కొన్న పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద దాఖలైన ఫిర్యాదులపై చట్టసభల స్పీకర్ ఉత్తర్వులు వెలువరించటానికి కాలవ్యవధిని నిర్దేశిస్తూ సుప్రీంకోర్టు గత తీర్పుల్లో ప్రకటించింది. కోర్టు ధిక్కార ఉత్తర్వుల దాకా వెళ్లిన దాఖలాలూ ఉన్నాయి. అయినా, రాజ్యాంగం ప్రసాదించిన విచక్షణ హక్కును సభాపతి సహేతుకమైన సమయంలో ఉపయోగించట్లేదనేది వాస్తవం. దీనిని ఎక్కడా రాహుల్ ప్రస్తావించలేదు. పార్లమెంట్ చర్చలో ఎక్కడా ఫిరాయింపులపై మాట్లాడడం లేదు. ఎందుకంటే ఒక రాజకీయ పార్టీ టికెట్‌పై ఎన్నికల్లో గెలిచిన ఒక సభ్యుడు ఎన్నికల తర్వాత అధికార పార్టీలో చేరడం అలవాటు చేసుకున్నాడు. దేశవ్యాప్తంగా ఇది జరుగుతోంది. గెలిచిన వారు మరో రాజకీయ పార్టీలో చేరటం ఆనవాయితీగా మారింది. ఒక రాజకీయ పార్టీ ప్రతినిధిగా ఎన్నుకోబడిన సభ్యుడు ఆ ఓటర్ల తీర్పును కాలరాచి తన ఇష్టానుసారంగా అధికారంలో ఉన్న పార్టీలోకి మారిపోతున్నారు. పార్టీలు మారే ఈ విధానం మొట్టమొదటగా హర్యానాలో 'ఆయారామ్ గయారామ్'గా, ప్రచారంలోకి వచ్చింది. అధికారంలో ఉన్న పార్టీలో ఉంటే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఎక్కువగా తెచ్చుకునే అవకాశం ఉంటుందని చెప్పడం ద్వారా రాజకీయ పార్టీలు ప్రజలను వంచిస్తున్నాయి. అంటే విపక్షంలో ఉంటే



నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోక పోవడం అధికార పార్టీ తప్పిదంగా గుర్తించాలి. ఇలా పార్టీలు మారడం తెలుగు రాష్ట్రాల్లో చూశాం. తన నియోజక వర్గంలోని ఓటర్ల అభీష్టం మేరకే అధికార పార్టీ కండువా కప్పుకొన్నట్టు చెప్పుకోవటం సాకు మాత్రమే. అక్రమంగా వెనుకేసుకున్న ఆస్తులను సీబీఐ లేదా ఇతర దర్యాప్తు సంస్థల నుంచి కాపాడుకునేందుకు, దర్యాప్తులు జరగకుండా చూసుకునేందుకు చేస్తున్న విన్యాసాలు తప్ప మరోటి కాదు. ఇది కళ్లకు కనిపిస్తున్న నిజం. కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. దీనిపై పార్లమెంటులో చర్చించడం రాహుల్‌కు ఇష్టం ఉండదు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ ఇవన్నీ ప్రోత్సహించింది. ఇలా చర్చిస్తే తమ బండారం ఎక్కడ బయట పడుతుందో అన్న భయం. అందుకే అక్రమంగా ఉన్న ఓట్లను తొలగించడం రాహుల్‌కు నచ్చదు. ఓట్ చోరీ అంటూ ప్రచారం చేసి బీహార్‌లో బొక్కబోర్లా పడ్డారు. కాంగ్రెస్ ఓట్ చోరీకి ఇండియా కూటమితో సంబంధం లేదని కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా తాజాగా చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు కనువిప్పు కావాలి. ఇండియా కూటమిలో దీనిపై స్పష్టత లేదా ఏకాభిప్రాయం లేదని అర్థం అవుతోంది. 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం' అనేది ఒకటి ఉన్నదని, దానికి కట్టుబడి ఉండాలనే నియమం చాలామంది చట్టసభల సభ్యుల్లో కనపడడం లేదు. ప్రతిపక్షం నుంచి అధికార పార్టీలో చేరిన సభ్యుల సభ్యత్వం రద్దు ఫిర్యాదులు ఎంతకాలానికి పరిష్కారమవుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. ఐదేండ్ల సభ కాలపరిమితి కూడా ముగిసిపోతోంది. కోర్టుల్లో కూడా కేసులు తేలడం లేదు. తెలంగాణలో వేములవాడ ఎమ్మెల్యేగా ఉన్న చెన్నమనేని రమేశ్ పౌరసత్వ వివాదం దాదాపు ఓ దశాబ్ద కాలం నడిచింది. ఆయన భారత పౌరుడా కాదా అన్నది కూడా తేల్చడంలో ఏళ్లు పడితే ఎలా. ఇవన్నీ కూడా ఎన్నికల సంస్కరణలో చర్చించాల్సిన అంశాలే. ఎన్నికల అంశాలన్నింటిని చర్చించి పారదర్శక విధానాలు అవలంబించాలి. అప్పుడే మన ఎన్నికల వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది. అది చేయకుండా కేవలం ఓట్ చోరీ అంటూ అక్రమ వలసదారులకు అండగా దేశంలో స్థానం కల్పించడం దేశద్రోహమే అవుతుంది. అందువల్ల సమగ్ర ఎన్నికల సంస్కరణలపై చర్చ జరగాలి. తద్వారా రాహుల్ మంచి ఇమేజ్ సంపాదించుకోవచ్చు. అందుకు కాంగ్రెస్ పూనుంటే బాగుండేది. కానీ ఎన్నికల సంస్కరణలకు ఎవరు కూడా సిద్దంగా లేరని అర్థం అవుతోంది. అందుకే చర్చ అసమగ్రంగానే సాగింది.

## ఉప సర్పంచ్‌గా గెలిచిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

సంగారెడ్డి,ఊరికి సేవ చేయాలన్న సంకల్పంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉప సర్పంచ్‌గా గెలుపొందాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసిన ఓ వ్యక్తి ఉప సర్పంచ్ పదవిని దక్కించుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేసేవాడు. అతడి తల్లిదండ్రులు 18 ఏళ్లపాటు గ్రామంలో పదవుల్లో ఉన్నారు. వారి బాటలోనే సేవ చేయాలని ప్రవీణ్ నిర్ణయించుకున్నాడు. ఉద్యోగాన్ని వదిలి గ్రామానికి వచ్చాడు. ఇటీవల జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేయాలని భావించాడు. అయితే రిజర్వేషన్ అనుకూలించకపోవడంతో తన అనుచరుడిని సర్పంచ్‌గా గెలిపించుకున్నాడు. ప్రవీణ్ వార్డు మెంబర్‌గా విజయం సాధించి ఉపసర్పంచ్ పదవిని దక్కించుకున్నాడు. సర్పంచ్, ఉపసర్పంచ్ పదవులు తాను కోరుకున్నట్లే రావడంతో మరింత సంతోషంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశాడు. తామిద్దరం కలసి గ్రామాభివృద్ధికి పాటుపడతామని అన్నారు.

## రెండేళ్లుగా గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

మహబూబ్‌నగర్, అధికార పార్టీ ఎన్ని ఇబ్బందులు పెట్టిన బీఆర్ఎస్ అభ్యర్థులు తెగించి కొట్లాడుతున్నారని, మూడో విడతలలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపు ఖాయమని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో గ్రామాలు అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. రెండేళ్లుగా ప్రజలు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యేల సొంత గ్రామంలో కాంగ్రెస్ ఓటమి పాలవుతుండడంతో కాంగ్రెస్ సర్పంచును గెలిపిస్తేనే నిధులు మంజూరు చేస్తామని అనేక చోట్ల ఎమ్మెల్యేలు ఓటమితో ఫ్రస్టేషన్‌తో మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.ఎమ్మెల్యే నియోజకవర్గంలో అందరికీ ప్రజా ప్రతినిధిగా ఉంటారని, అభివృద్ధి, సంక్షేమంలో ప్రజలను సమానంగా చూడాలన్నారు. సీఎం జిల్లా నుంచి ఉన్నప్పటికీ ఆశించినంత అభివృద్ధి జరగడం లేదని ఆరోపించారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని వెల్లడించారు.

### తెరపైకి సెవన్ సిస్టర్స్ టాపిక్!

అస్సాం,పాకిస్థాన్ తూర్పు కమాండ్ చేతిలో చిత్రవధలు అనుభవిస్తూ.. నెలల తరబడి పోరాడుతూ.. ఆఖరికి భారత్ సైన్యం ధైర్య సాహసాలతో సహకరించి ప్రాంత బిక్ష పెడితే.. డిసెంబర్ 16 - 1971న బంగ్లాదేశ్ స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంది. ఇది వాస్తవం. అలాంటి భారత్ పై తాజాగా అవాకులు చెవాకులూ పేలుతూ.. సరిహద్దుల్లో ఉన్న సెవన్ సిస్టర్స్ గురించి కారు కూతలు కూస్తున్నాడు బంగ్లాదేశ్ కు చెందిన ఓ యువనేత!అవును... బంగ్లాదేశ్ కు ప్రాంత బిక్ష పెట్టిన భారత్ పై ఆ దేశానికి చెందిన ఓ యువ నాయకుడు అవాకులూ చెవాకులూ పేలాడు. ఇందులో భాగంగా.. ఆ దేశంలో కొత్తగా ఏర్పడిన నేషనల్ సిటిజన్ పార్టీ నాయకుడు హస్నత్ అబ్దుల్లా.. బంగ్లాదేశ్ అస్థిరతకు కారణమైతే, సెవన్ సిస్టర్స్ ను కట్ చేసే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. దీనిపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిస్వా శర్మ ఘాటుగా స్పందించారు.ఢాకాలోని సెంట్రల్ షహీద్ మినార్ వద్ద జరిగిన సభలో ప్రసంగించిన అబ్దుల్లా.. బంగ్లాదేశ్ సార్వభౌమాధికారం, సామర్థ్యం, ఓటింగ్ హక్కు, మానవ హక్కులను గౌరవించని శక్తులకు మీరు అవకాశం కల్పిస్తే.. బంగ్లాదేశ్ ప్రతిస్పందిస్తుందని తాను భారత్ కు స్పష్టం చేయాలనుకుంటున్నానని.. ఇందులో భాగంగా ఏడుగురు సోదరీ మణులను దూరం చేసే అవకాశం ఉందని తెలిపారు.ఇదే సమయంలో.. బంగ్లాదేశ్ అస్థిరమైతే దాని ప్రతిఘటన అగ్ని సరిహద్దులను దాటి వ్యాపిస్తుందని హెచ్చరించిన అబ్దుల్లా.. స్వాతంత్ర్యం వచ్చిన 54 సంవత్సరాల తర్వాత కూడా బంగ్లాదేశ్ పై నియంత్రణ సాధించడానికి ప్రయత్నిస్తున్న రాబందుల ప్రయత్నాల ను ఎదుర్కొంటూనే ఉందని తెలిపారు.

ఏడుగురు సోదరీమణులు!:

కాగా... అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాలను సెవన్ సిస్టర్స్ అని పిలుస్తారనే సంగతి తెలిసిందే. ఇక అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం రాష్ట్రాలు బంగ్లాదేశ్ తో భూ సరిహద్దును పంచుకుంటాయి.ఇది ఈ ప్రాంతం సున్నితత్వాన్ని హైలెట్ చేస్తుంటుంది!

స్పందించిన అస్సాం సీఎం!:

ఇలా.. బంగ్లాదేశ్ లో కొత్తగా ఏర్పడిన నేషనల్ సిటిజన్ పార్టీ నాయకుడు హస్నత్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ స్పందించారు. ఇందులో భాగంగా... భారత్ లోని ఈశాన్య ప్రాంతాన్ని బంగ్లాదేశ్ తో విలీనం చేయాలనే ఆలోచనను ప్రమాదకరమైనదని అభివర్ణించారు. ఇటువంటి ప్రకటనలపై భారతదేశం మౌనంగా ఉండదని హెచ్చరించారు.

## 58 లక్షలకు పైగా ఓట్లు తొలగించిన ఈసీ

న్యూఢిల్లీ,కొందరు చనిపోయారు.. ఇంకొందరు అదృశ్యమైపోయారు.. మరికొందరు వలసెల్లిపోయారు.. మొత్తంగా బెంగాల్‌లో 58 లక్షల మందికి పైగా ఓటర్లను తొలగించింది ఎలక్షన్ కమిషన్. ఈ దెబ్బతో.. బెంగాల్ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా ఇంత భారీ స్థాయిలో ఓట్లు తొలగించడం దేశం మొత్తం హాట్ టాపిక్‌గా మారింది. రాబోయే బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో.. దీని ఎఫెక్ట్ ఎవరిపై ఉంటుందనే చర్చ మొదలైంది. సీఎం మమతా బెనర్జీ ఏం చేయబోతున్నారు? సర్‌పై.. కాంగ్రెస్ ఏమంటోంది?బెంగాల్‌లో భారీగా ఓట్ల తొలగింపుఇంకొన్ని నెలల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. పశ్చిమ బెంగాల్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా.. ఎన్నికల సంఘం 58 లక్షలకు పైగా ఓట్లను తొలగించింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తర్వాత.. డ్రాఫ్ట్ ఓటర్ లిస్టుని కూడా రిలీజ్ చేశారు. పేర్లు తొలగించిన ఓటర్లలో.. 24 లక్షల మంది చనిపోయారని, దాదాపు 20 లక్షల మంది ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారని, 12 లక్షల మంది తప్పిపోయారని, లక్షా 38 వేల మంది బోగస్ ఓటర్లు ఉన్నారని తెలిపింది ఈసీ. ఇతర కారణాలతో మరో 57 వేల మంది పేర్లను తొలగించారు. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్.. బెంగాల్‌లో రాజకీయంగా గందరగోళాన్ని పెంచింది. రాజకీయ వివాదాలకు కేంద్రంగా మారింది. ఇది.. ఎన్నికలకు ముందు బెంగాల్‌లో పొలిటికల్ తుఫాన్ సృష్టించే అవకాశం ఉందనే మాటలు వినిపిస్తున్నాయ్. ఇప్పటికే.. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేతలు 58 లక్షల ఓటర్ల తొలగింపు అన్యాయం అంటున్నారు. బెంగాల్ లిస్టు నుంచి ఓటర్లను తొలగించేందుకు.. ఇది బీజేపీ చేసిన కుట్ర అని ఆరోపిస్తున్నారు. సీఎం మమతా బెనర్జీ కూడా ఈ ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా తారుమారు చేసేందుకే.. బీజేపీ, ఎన్నికల సంఘం కుట్ర పన్నాయని ఆరోపించారు.

# అరుణాచల్ ప్రదేశ్‌లో ఐఎస్ఐ ఏజెంట్లు.. పాకిస్తాన్, చైనా గేమ్‌ప్లాన్!



అరుణాచల్ ప్రదేశ్: అరుణాచల్ ప్రదేశ్ ఈశాన్య భారతంలో చివరిన ఉండే రాష్ట్రం. పక్కనే చైనా సరిహద్దు. ఇప్పటికే చైనా అరుణాచల్ ప్రదేశ్ మాదే అంటుంది. మ్యాపులు విడుదల చేస్తూ కవ్విస్తోంది. అయితే ఇక్కడ ఇంత వరకు ఎలాంటి ఉగ్ర కార్యకలాపాలు లేవు. కానీ తాజాగా రాజధాని ఈటానగర్ సమీప చింపు గ్రామంలో ఒక యువకుడు అసాధారణ చూపులు గుర్తించాడు. శీతాకాలంలో రంగురంగుల వస్త్రాలు విక్రయించుకునే వ్యక్తి ప్రాంతాలు, మార్గాలను ఫొటోలు, వీడియోల ద్వారా రికార్డ్ చేస్తున్నాడు. రెండోసారి మిలిటరీ స్థాపనల వద్ద ఇలాంటి కదలికలు చూసి, రాజకీయ నాయకుడి, తర్వాత పోలీసుల వద్ద సమాచారం అందించాడు. పోలీసుల విచారణలో షాకింగ్ విషయాలు వెలుగు చూశాయి.

చిరు వ్యాపారుల ముసుగులో..

యువకుడు ఇచ్చిన సమాచారంతో చిరు వ్యాపారిని నవంబర్ 22న పోలీసులు వ్యాపారిని పట్టుకుని తప్పుడు గుర్తింపులు (బిహార్, ఢిల్లీ) గుర్తించినా, జక్కువాడా (జమ్మూ కశ్మీర్) నివాసి నజీర్ అహ్మద్ మాలిక్‌గా బయటపడ్డాడు. ఇన్నర్ లైన్ పర్మిట్ సరైనదైనా, సోషల్ మీడియాలో అల్-అక్సా గ్రూప్, సైనిక రికార్డులు బయటపడ్డాయి. 3000 కి.మీ. ప్రయాణం, డేటా డిలీట్ ప్రయత్నాలు అనుమానాలు పెంచాయి. విశ్లేషణ: డిజిటల్ ఫుట్‌ప్రింట్‌లు ఆధునిక రహస్య కార్యకలాపాల మాయను ధ్వంసం చేస్తాయి, పోలీసు విచారణ దృష్టికి దారి తీసింది.

మరో ఇద్దరు కూడా..

నజీర్ అహ్మద్ మాలిక్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు సామిర్ అహ్మద్ బిన్, మాళేలో గిలాల్ అహ్మద్ (26 ఏళ్లు, కూడా కుప్వాడా) అరెస్టయ్యారు. ముందస్తు టెలిగ్రామ్ గ్రూపులు, ఐఎస్ఐ ఆదేశాలతో సైనిక స్థాపనలపై దృష్టి, బాంబు తయారీ, మైన్ ఇన్‌స్టాలేషన్ శిక్షణలు వెల్లడయ్యాయి. పాలస్తీనా మసీదు పేరుతో నడిచే ఉగ్ర గ్రూపులో సభ్యులుగా ఉన్నారు. భారత లోతట్టు ప్రాంతాల్లో చొరబడటం, బహిరంగ రూపాలు ధరించడం ఇంటెలిజెన్స్ గ్యాప్‌లను సూచిస్తుంది.

పాక్-చైనా ఎక్స్చేంజ్..

వీరు సేకరించిన సమాచారం పాకిస్తాన్ ద్వారా చైనాకు వెళ్తుందని తెలిసింది, అరుణాచల్‌లో 38 విమాన యానా ప్రాజెక్టులు లక్ష్యం. చాంగ్‌లాంగ్‌లో గులామ్ అహ్మద్ మీర్, గౌహతిలో మాజీ ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది కుల్దీప్ శర్మ, మిసామారీ వ్యూహకర్తలు, 2019 అరెస్ట్ నిర్మల్ రాయ్ (మాజీ ఆర్మీ, దుబాయ్ లింక్) గుర్తించబడ్డారు. అల్‌ఫలా యూనివర్సిటీ కేసు తర్వాత ఈ అరెస్టులు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ఈ ఘటనలు ఇన్‌లైన్ పర్మిట్ల పరిశీలన, డ్రోన్ నిఘా, స్థానికుల సహకారాన్ని బలోపేతం చేయాలని హెచ్చరిస్తున్నాయి. పోలీసు చురుకుదనం నెట్‌వర్క్‌ను క్షీణింపజేసింది. చిన్న వ్యాపారి మాస్క్‌లో దాగిన ఆగ్రాసం భారత సరిహద్దుల హెచ్చరిక, టెక్నాలజీ బేస్డ్ రక్షణ అవసరం.

# రేవంత్ పై పాజిటివిటీ పెరగడానికి కారణమేంటి?



హైదరాబాద్, "ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదు. పరిపాలన కూడా సరిగ్గా లేదు. అధిష్టానం ఏమాత్రం స్వేచ్ఛ ఇవ్వడం లేదు. అభివృద్ధి ఆగిపోయింది. అప్పులు తేవడం పెరిగిపోయింది. 10 సంవత్సరాల కాలంలో తెలంగాణ విపరీతంగా అభివృద్ధి చెందితే.. ఇప్పుడు మాత్రం నేల చూపులు చూస్తోంది" ఇదిగో ఇలా సాగిపోతోంది గులాబీ పార్టీ విమర్శల వ్యవహారం. సోషల్ మీడియా ద్వారా రేవంత్ రెడ్డిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతోంది. రేవంత్ వేసే ప్రతి అడుగును భూతద్దంలో పెట్టి చూస్తోంది గులాబీ సోషల్ మీడియా. ఈ స్థాయిలో విమర్శలు.. స్వపక్షం నుంచి ఒత్తిడి.. అధిష్టానం నుంచి అంతగా లభించని సపోర్టు.. ఇన్ని ప్రతికూలతల మధ్య రేవంత్ రెడ్డి పడుతున్న ఇబ్బందులు మామూలువి కాదు. ఇన్ని సమస్యలు ఎదుర్కొంటూనే పరిపాలన సాగిస్తున్నారు రేవంత్ రెడ్డి. వాస్తవానికి అతని స్థానంలో మరొక నాయకుడు ఉండి ఉంటే పరిస్థితి మరో విధంగా ఉండేది.. కాంగ్రెస్ పార్టీ నాలుగు ముక్కలయ్యేది. తనకున్న చాకచక్యంతో.. పరిజ్ఞానంతో ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నారు రేవంత్ రెడ్డి.. ఆయన పరిపాలనలో లోపాలు లేవా? ప్రజలకు అంతా మంచే జరుగుతోందా? ప్రభుత్వం నుంచి ప్రజలకు బ్రహ్మాండమైన సహకారం లభిస్తోందా? ఈ ప్రశ్నలకు లేదు అని, కాదు అని సమాధానం రావచ్చు. అందులో అనుమానం కూడా లేదు. కాకపోతే ఇన్ని ప్రతికూలతల మధ్య.. రేవంత్ రెడ్డి పరిపాలన సాగించడమే అసలైన ఆశ్చర్యకరమైన విషయం. రేవంత్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు కొన్ని వివాదాస్పదంగా మారాయి. మంత్రుల వ్యవహార శైలి కూడా ఇబ్బందికరంగా మారింది.. ఇవన్నీ ప్రతిపక్ష గులాబీ పార్టీకి అనుకూలంగా మారాయి. అయితే ఇన్ని అవరోధాలు ఉన్నప్పటికీ.. రేవంత్ రెడ్డి పరిపాలన రథాన్ని సవ్యంగా ముందుకు సాగించడమే ఇక్కడ అసలైన గొప్ప విషయం. ఎందుకంటే గులాబీ పార్టీ సోషల్ మీడియా బలంగా ఉంది. ఆ పార్టీ మొత్తాన్ని కేటీఆర్ నడిపిస్తున్నారు. ఆర్థికంగా గులాబీ పార్టీకి బలం విపరీతంగా ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నుంచి మొదలు పెడితే నాయకుల వరకు అన్ని లోపాలు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ రేవంత్ రెడ్డి వీటన్నింటిని దాటుకొని అటు పార్టీని.. ఇటు ప్రభుత్వాన్ని ముందు వరుసలో నిలపడమంటే మామూలు విషయం కాదు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో వరస విజయాలను సాధిస్తుంది.. తెలంగాణలో చెప్పుకునే స్థాయిలోనే మెజారిటీ సాధించిన కాంగ్రెస్ పార్టీ.. ముందుగా కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయం సాధించింది.. ఆ తర్వాత జూబ్లీహిల్స్ ఉపయోగ ఎన్నికల్లో గెలుపును అందుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవదని.. ఈ ఉప ఎన్నికలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రెఫరెండం అని కేటీఆర్ పదేపదే వ్యాఖ్యానించారు. కానీ వాస్తవ ఫలితం మాత్రం రేవంత్ రెడ్డికి అనుకూలంగా వచ్చింది. ఒకరకంగా రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ద్వారా అటు కేటీఆర్‌కు, ఇటు గులాబీ పార్టీకి ఏకకాలంలో చెక్ పెట్టారు. దానిని మర్చిపోకముందే స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్ష గులాబీ పార్టీకి దిమ్మతిరిగే విధంగా సమాధానం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో కనివిని ఎరుగని స్థాయిలో స్థానిక సంస్థలలో సీట్లు సాధించి సరికొత్త రికార్డు సృష్టించారు. తద్వారా గులాబీ పార్టీ తనపై పదే పదే చేస్తున్న నెగిటివ్ ప్రచారాన్ని తిప్పికొడుతున్నారు రేవంత్ రెడ్డి. ప్రజల ముందు సానుభూతి మంత్రాన్ని పఠిస్తూ సరికొత్త రాజకీయ నాయకుడిగా అవతరిస్తున్నారు.. తెలంగాణ ప్రజల్లో పాజిటివిటీ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# హైకోర్టుకి వెళ్లే ఆలోచనలో సునీత?



హైదరాబాద్, మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు కొత్త మలుపు తిరిగిందా? ఈ కేసులో జగన్ ఫ్యామిలీ సేఫేనా? సీబీఐ కోర్టు తీర్పుపై అప్పీల్ చేసేందుకు సునీతారెడ్డి ప్లాన్ చేస్తున్నారా? హైకోర్టుకి వెళ్లాలని ఆలోచన చేస్తున్నారా? అదే జరిగితే జగన్ ఫ్యామిలీకి ఇబ్బందులు తప్పవా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.

వివేకానంద కేసులో మళ్లీ సీబీఐ దర్యాప్తు

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తుకు సీబీఐ ప్రత్యేకకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కేసులో నిందితుడు సునీల్‌యాదవ్ బ్రదర్ కిరణ్- అర్జున్‌రెడ్డి మధ్య ఫోన్ సందేశాలు, వారి పాత్రపై దర్యాప్తు చేసి నెలరోజుల్లో సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేయాలని నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ఆదేశాలు జారీచేసింది. డిసెంబర్ 10న ఇచ్చిన తీర్పుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. ఒక విధంగా చెప్పాలంటే ఈ కేసులో అసలు నిందితులు తప్పించుకున్నట్టేనని కొందరు బలంగా వాదిస్తున్నారు. ఆ మాత్రం దానికి మళ్లీ సీబీఐ విచారణ దేనికన్నది మరికొందరి ప్రశ్న.

హైకోర్టుకి వెళ్లే ఆలోచనలో బాధితురాలు సునీత?

న్యాయం కోసం బాధితులు కోర్టు గడప ఎక్కుతారని, వారి కోరిక మేరకు దర్యాప్తు చేయాలి కానీ, ఫలానా విషయంలో మాత్రమే దర్యాప్తు చేయాలని ఆదేశాలు ఇవ్వడం ఏంటన్నది వివేకానంద అనుచరుల మాట. ఒకవిధంగా చెప్పాలంటే జగన్ ఫ్యామిలీ సభ్యులంతా బయటపడినట్టే ఉందని అంటున్నారు. దర్యాప్తు చేయాలా.. వద్దా? అనేది కోర్టు నిర్దేశించాలి. ఎలా చేయాలో, ఎంతవరకు చేయాలి అనేది దర్యాప్తు సంస్థకు నిర్దేశించకూడదని కొందరు న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కింది కోర్టు ఆదేశాలపై బాధితురాలు సునీతరెడ్డి షాకయ్యారు. ఆమె న్యాయ నిపుణులతో మంతనాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కోర్టు తీర్పుని హైకోర్టులో అప్పీల్ చేయాలని ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. వివేకానంద మృతి తర్వాత జగన్ ఫోన్ కాల్ అందుకోవడంపై తదుపరి దర్యాప్తు అవసరం లేదని తేల్చేసింది ప్రత్యేక కోర్టు. ఫ్యామిలీ సభ్యుడు మృతి చెందినప్పుడు దగ్గరి బంధువులకు తెలియపరచడం సహజమని అభిప్రాయపడింది. ఈ విషయాన్ని అనుమానించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మాజీ ఐఏఎస్ అజేయ కల్లాం 2023 ఏప్రిల్ 29న ఓ వాంగ్మూలం ఇచ్చారు. తాను జగన్‌తో 2019 మార్చి 15న సమావేశంలో ఉన్నప్పుడు భారతి నుంచి సమాచారం వచ్చినట్టు చెప్పారని న్యాయమూర్తి గుర్తు చేశారు. జగన్‌కు ఫోన్‌కాల్ వచ్చిన వ్యవహారంపై తదుపరి దర్యాప్తు అవసరం లేదని కోర్టు అభిప్రాయపడినట్టు తీర్పులో ప్రస్తావించారు. వివేకానంద చనిపోయిన తర్వాత అంటే 2019 మార్చి 15న తెల్లవారుజామున 1.42 గంటలకు కిరణ్‌యాదవ్ నుంచి అర్జున్‌రెడ్డికి మెసేజ్ వచ్చినట్లు సీబీఐ తేల్చింది. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య సంభాషణల వ్యవహారాన్ని తేల్చాలని తీర్పులో ప్రస్తావించారు న్యాయమూర్తి. ఈ క్రమంలో సునీతారెడ్డి హైకోర్టు వెళ్లి మళ్లీ సీబీఐ చేత దర్యాప్తు చేయిస్తే ఈ కేసు కొత్త మలుపు తిరగడం ఖాయమని అంటున్నారు.

# మెట్రోపాలిటీన్ నగరాల వైపు ఏపీ యువత!



అమరావతి, ఉద్యోగాలవిషయంలో ఒక సంస్కృతి నడుస్తోంది. ఉన్న ఊరిలో ఉన్న పరిశ్రమలో పనిచేసేందుకు యువత ముందుకు రావడం లేదు. చిన్నాచితక నగరాల్లో పని చేసేందుకు సైతం ఆసక్తి చూపడం లేదు. కేవలం మెట్రోపాలిటన్ నగరాల్లో మాత్రమే ఉండే పరిశ్రమల్లో పనిచేసేందుకు మొగ్గు చూపుతున్నారు. హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై వంటి నగరాలకు వెళ్లి ఎక్కువ మంది ఉద్యోగాలు చేస్తున్నారు. స్థానికంగా అందుబాటులో ఉద్యోగాలు ఉన్న వద్దని చెబుతున్నారు. దానికి అనేక రకాల కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా మనిషి జీవన విధానం మారడం వల్లే ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది. భారీగా వేతనాలు ఒక ఎత్తు అయితే.. విలాసవంతమైన జీవితం మరో ఎత్తు.

అప్పుడే వివాహ ప్రయత్నాలు..

సాధారణంగా ఒక యువకుడు ఉద్యోగం చేశాడు అంటే ఆ కుటుంబం అతడికి వివాహం చేయాలని భావిస్తుంది. అయితే సాధారణ పట్టణాలతో పాటు నగరాల్లో ఉద్యోగం చేసే వారికి వివాహ సంబంధాలు దొరకడం అంత ఈజీ కాదు. ఎందుకంటే అందరి అభిరుచులు మారాయి. తాను చేసుకోబోయే వ్యక్తి మెట్రోపాలిటన్ నగరాల్లో పనిచేస్తేనే అన్నట్టు వ్యవహరిస్తున్నారు నేటి యువతులు. వారి కన్నవారి సైతం తమ అల్లుడు మెట్రోపాలిటన్ నగరాలతో పాటు విదేశాల్లో ఉంటేనే అన్నట్టు చూస్తున్నారు. ఈ పరిస్థితి కారణంగా ఉద్యోగంతో పాటు వివాహానికి ఎక్కువగా మెట్రోపాలిటన్ నగరాలకు వెళ్తున్నారు యువకులు.

ఆ నగరాల్లోనే అధికం

ఆంధ్రప్రదేశ్ నుంచి సాఫ్ట్వేర్ ఉద్యోగులతో పాటు స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించిన ఏ ఉద్యోగి స్థానికంగా పనిచేయడం చాలా తక్కువ. మీ బాబు ఎక్కడ పని చేస్తున్నాడు అంటే ఎక్కువ మంది తల్లిదండ్రులు హైదరాబాద్, బెంగళూరు అని పేర్లు చెబుతుంటారు. చెన్నై తో పాటు ముంబై, ఢిల్లీ అని సమాధానం ఇస్తుంటారు. చివరకు వివాహ పరిచయ వేదికల్లో సైతం ఈ మెట్రోపాలిటన్ నగరాలు అని ఉంటేనే అమ్మాయి తరఫు బంధువులు మొగ్గు చూపుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు ఉద్యోగాలను నిర్దేశిస్తుంది వివాహ వ్యవస్థ. అబ్బాయికి ఉద్యోగం వచ్చింది అంటే తల్లిదండ్రులు వెంటనే వివాహ ఆలోచన చేస్తున్నారు. అయితే ఇప్పుడు ఈ విలాసవంతమైన జీవితాలకు అలవాటు పడినవారు తమవారు కూడా మెట్రోపాలిటన్ నగరాల్లో ఉండాలని కోరుకుంటున్నారు. ఉద్యోగంలో ఇదో రకమైన సంక్షోభం అన్నమాట.

# ఆధార్ డేటా సురక్షితం..పార్లమెంటులో కేంద్రమంత్రి వెల్లడి



న్యూఢిల్లీ, భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ డేటా బేస్ నుంచి ఆధార్‌కార్డు హోల్డర్ల డేటా దుర్వినియోగం జరగలేదని కేంద్రం స్పష్టంచేసింది. ఆధార్ డేటా బదిలీ, స్టోరేజీ సమయంలో అధునాతన ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. నేషనల్ క్రిటికల్ ఇన్ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొటెక్షన్ సెంటర్ పర్యవేక్షణలో ఆధార్ వ్యవస్థ సురక్షితంగా ఉందని తెలిపారు. అధునాతన భద్రతా చర్యల కారణంగా పౌరుల ఆధార్ డేటా సురక్షితంగా ఉందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఉడాయ్‌లో సుమారు 134 కోట్ల మంది ఆధార్ హోల్డర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 16వేల కోట్ల అథంటికేషన్ లావాదేవీలు జరిగాయని కేంద్రమంత్రి తన సమాధానంలో వెల్లడించారు. బలమైన సాంకేతిక, సంస్థాగత భద్రతా చర్యల కారణంగా ఆధార్ డేటా సురక్షితంగా ఉందని తెలిపారు. ఆధార్ డేటా భద్రతకు ఉడాయ్.. డిఫెన్స్- ఇన్- డెప్త్ విధానాన్ని అనుసరిస్తూ బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. ఇందులో ఒక లేయర్ దెబ్బతిన్నా.. మిగిలినవి డేటాకు రక్షణ కల్పిస్తాయని చెప్పారు. ఇది ఎప్పటికప్పుడు ఆధార్ సైబర్ సెక్యూరిటీకి సంబంధించి సూచనలు చేస్తుంటుందని పేర్కొన్నారు. దీనికితోడు స్వతంత్ర ఆడిట్ ఏజెన్సీలు కూడా ఆధార్ ఎకోసిస్టమ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు.

## పాఠశాలలకు బాంబు బెదిరింపులు

గాంధీనగర్, గుజరాత్‌లో బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. అహ్మదాబాద్ లోని పలు పాఠశాలలకు బుధవారం ఉదయం బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. అప్రమత్తమైన పోలీసులు ఆయా పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. నగరంలోని మహారాజా అగ్రసేన్ స్కూల్, వేజల్పూర్ జైడస్ స్కూల్, నిర్మాణ్ స్కూల్, డివైన్ స్కూల్, ఆవిష్కర్ స్కూల్, కలోల్ దేవ్ ఇంటర్నేషనల్ సహా ప్రముఖ పాఠశాలలకు ఈ బెదిరింపులు వచ్చాయి. పాఠశాలల ఆవరణలో పేలుడు పదార్థాలు ఉంచినట్లు బెదిరింపు మెయిల్‌లో పేర్కొన్నారు.

# వృద్ధి లక్ష్యాన్ని 17.11 శాతంగా పెట్టుకున్నాం



అమరావతి, వ్యవసాయం, ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్లలో సాధించిన త్రైమాసిక ఫలితాలపై పరీక్షలు రాసిన విద్యార్థిలా ఎదురు చూస్తానని.. దీనికి అనుగుణంగానే అధికారులు పని చేయాలని, లక్ష్యాలను చేరుకోవాలని సిఎం చంద్రబాబు కలెక్టర్లకు సూచనలు చేశారు. గడిచిన రెండు త్రైమాసికాల్లో మెరుగైన ఫలితాలను సాధించగలిగామన్నారు. ఈసారి వృద్ధి లక్ష్యాన్ని 17.11 శాతంగా పెట్టుకున్నామని.. మొత్తం 17 వర్టికల్స్‌లో ఫలితాలు సాధిస్తేనే జీఎస్డీపీ పెరుగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 5వ కలెక్టర్ల సమావేశం కొనసాగుతోంది. వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖలకు చెందిన ప్రగతిపై ఉన్నతాధికారులు ప్రజంటేషన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..లైవ్ స్టాక్, మాన్యుఫాక్చరింగ్, ఫిషింగ్ సహా వేర్వేరు రంగాల్లో ఈ ప్రగతిని సాధించాలని కలెక్టర్లకు తెలియజేశారు. వ్యవసాయ రంగం ఎప్పుడూ డిమాండ్ డ్రివెన్‌గా ఉండాలన్నారు. జీఎస్డీపీ సాధనలో ప్రణాళిక అత్యంత కీలకమని... జిల్లా స్థాయిలో పక్కా ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. అందుకే అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా కొన్ని ప్రాంతాలకు చేయూత ఇస్తున్నామని చెప్పారు. ప్రతీ యూనిట్, ప్రతీ శాఖలో సామర్థ్యాలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నా మన్నారు. వచ్చే కలెక్టర్ల సదస్సుకు ప్రగతిలో, కలెక్టర్లు, ఉన్నతాధికారుల పనితీరులో క్వాంటం ఇంప్రూవ్మెంట్ కనిపించాలని తెలిపారు. పశుగ్రాసం పెంచే అంశంపై డ్వాక్రా మహిళలను భాగస్వామ్యం చేయలని అన్నారు. గతంలో తెలంగాణతో పోటా పోటీగా ఉండేవాళ్లమని.. గత ప్రభుత్వం అవలంభించిన తప్పుడు విధానాల వల్ల ఏపీ దక్షిణ భారతదేశంలో చివరి స్థానానికి చేరిందన్నారు. దీన్ని తిరిగి గేరప్ చేయాలని.. అగ్ర స్థానానికి చేరాలని చెప్పుకొచ్చారు. 2024 తర్వాత జీఎస్డీపీ కాస్తంత మెరుగైందన్నారు. వ్యవసాయ రంగంపై బాగా ఫోకస్ పెట్టాలని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎంత చేస్తున్నా... ఇంకా మిగిలే ఉంటుందని అన్నారు. మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ బలోపేతం చేయాలని సీఎం తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు మన ఉత్పత్తులను పంపేలా చేయగలిగితే వ్యవసాయ రంగం సుస్థిరత సాధిస్తుందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయిలో పంటలు పండించాలని అన్నారు. ఉద్యాన రంగంలో కూడా భారీ ఎత్తున పెట్టుబడులు రావాల్సిన అవసరం ఉందని సీఎం వెల్లడించారు. బీ ఖరీఫ్ రబీ మూడు సీజన్లు స్వల్ప కాలిక, ఐదేళ్ల కాలానికి మధ్య, 10 -15 ఏళ్లకు దీర్ఘకాలిక ప్రణాళికల్ని తయారు చేసుకోవాలని ఆదేశించారు. డిమాండ్ డ్రివెన్ పంటలు, వాటర్ సెక్యూరిటీ, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రిటెక్ లాంటి పదిసూత్రాలను ఇంటిగ్రేట్ చేసుకోవాలన్నారు. హార్టికల్చర్ విషయంలో ఏపీ నెంబర్ 1 ఉన్నామన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పూర్వోదయ కింద అభివృద్ధి ప్రణాళికలు చేస్తున్నామని అన్నారు. 2047కు ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఏ ఒక్కరు వెనుకపడినా లక్ష్యాలను చేరుకోవటం కష్టతరం అవుతుందని తెలిపారు. గేట్స్ ఫౌండేషన్, అగ్రివాచ్ లాంటి సంస్థల సేవలను వినియోగించుకుని రైతులకు లాభసాటిగా ఉండేలా చర్యలు తీసుకోవాని సమావేశంలో వెల్లడించారు. దేశీయంగా, అంతర్జాతీయ మార్కెట్లకు పంపేలా చర్యలు ఉండాలన్నారు. 60-70 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు కూడా ఈ ఉద్యాన పంటల రంగంలో రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. నాణ్యమైన ఉత్పత్తులను పండించేలా రైతులకు అవగాహన చైతన్యం కల్పించాలని అన్నారు. సేవల రంగంలో పర్యాటకం కూడా కీలకమని స్పష్టం చేశారు. బాపట్లలోని సూర్యలంక లాంటి బీచ్‌ల వద్ద ప్రముఖ బ్రాండ్లు వచ్చేలా చూడాలని కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో చేసుకున్న ఒప్పందాలను గ్రౌండ్ చేసుకునేలా భూ కేటాయింపులు చేసుకోవాలని మంత్రి లోకేష్ అన్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు దీనిపై దృష్టి పెట్టాలన్నారు. ఐటీ, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ మంత్రులంతా దీనిపై ప్రత్యేక దృష్టితో ఉన్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## రియల్టర్ మోసం చేశాడని ఆందోళన

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. గుంపర్రులోని కడిమిపుంతలో తుంగ నాగేశ్వర రావు అనే వ్యక్తిని దొంగగా ఆరోపిస్తూ.. ఆయన ఇంటిపై స్థానికులు కొందరు కోడిగుడ్లతో దాడి చేశారు. అంతేకాకుండా.. మైక్ సెట్‌తో పాటలు పాడుతూ నాగేశ్వర రావు ఇంటి ఎదుట అక్కడి యువకులు, మహిళలు బైఠాయించి ఆందోళన చేపట్టారు . ఈ నేపథ్యంలో నాగేశ్వర రావు కోడలైన ఆ గ్రామ సర్పంచ్ అమూల్యతో వాగ్వాదానికి దిగారు.

# హిడ్మా ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో పిల్...




అమరావతి, మావోయిస్టు అగ్ర నేత హిడ్మా ఎన్‌కౌంటర్ సంచలనంగా మారింది. హిడ్మాతోపాటు ఇతరుల ఎన్‌కౌంటర్ పై పీపుల్స్ యూనిటి ఫర్ సివిల్ లిబర్టీస్ హ్యూమన్ రైల్స్ ఫోరం అధ్యక్షురాలు జయ వింధ్యాల హై కోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సిట్టింగ్ జడ్జీతో లేదా ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జయ వింధ్యాల దాఖలు చేసిన పిటీషన్ విచారణ సందర్భంగా ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాళపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు ఉంచారు. మెజిస్టీరియల్ విచారణపై పిటిషనర్ల కు అభ్యంతరం ఉంటే సెషన్స్ జడ్జ్ లేదా మెజిస్ట్రేట్‌ని ఆశ్రయించాలని పేర్కొన్నారు. నేరుగా హై కోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు చేయడం కంటే, కింది కోర్టులో ఫిర్యాదు చేసి విచారణ కోరడం సరైన పక్రియ అని అయన అభిప్రాయపడ్డారు. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత చట్టబద్ధంగా జరగాల్సిన మెజిస్టీరియల్ విచారణ ఇప్పటికే మొదలైందని, దర్యాప్తు సంస్థలు నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నాయని ఏజీ కోర్టుకు తెలిపారు. ఇదిలా ఉంటే.. అడ్వకేట్ జనరల్ దమ్మాళపాటి శ్రీనివాస్ వాదనలను పరిగణలోకి తీసుకున్న హై కోర్టు ధర్మాసనం, ఈ విషయంలో మరింత లోతుగా అధ్యాయనం చేయాలని పిటీషనర్ తరుపు న్యాయవాదిని ఆదేశించడం గమనార్హం.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com